శ్రీ ప్రణవపీఠం
ఏలూరు

# ప్రణవ పద్మాకరం

మాస పత్రిక

నవంబర్, 2022



# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక

నవంబర్, 2022

## విషయ సూచిక

సంచిక-11
సంపుటి-1


| | | |
|---|---|---|
| సంపాదకీయం 1<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | శ్రీ గణేశ పురాణం 2<br>శ్రీమతి పాలగుమ్మి (వద్దిపర్తి) శ్రీవిద్య | శ్రీ వేంకటేశ్వర రహస్యం 5<br>శ్రీమతి నడుముక్కల (వద్దిపర్తి) శ్రీకళ |
| ఋషిచరిత్ర 7<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం | ఐశ్వర్యయోగం 9<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | పురాణంలో మహిళలు 10<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| స్తోత్రమాలిక 12<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | పండుగ విశేషాలు 16<br>బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ | సత్సంగ సమాచారము 31<br>శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు గారికి జయము జయము

మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యో నమః శ్రీ మాత్రే నమః

పూజ్య గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు ,శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




## సంపాదకీయం

### ప్రయత్నం – ఆనందం

మానవులందరూ ఆనందాన్వేషకులే కానీ ఆ ఆనందపు రహస్యం మాత్రం కొంతమందికే తెలుస్తుంది. వారే భగవంతుడిచ్చిన వివేకాన్ని వినియోగించుకొంటారు. తక్కిన వారు ఆనందాన్వేషణలో అలసిపోతుంటారు తప్ప ఆనందాన్ని పొందలేరు. ఆధునిక సమాజంలో పని పై ఇష్టం తక్కువ, ఫలితం పై ఆసక్తి ఎక్కువ కలిగిన వారే ఉన్నారు. అందువల్లనే వారు తగిన ఫలితం పొందలేక పోతున్నారు. సరియైన ప్రయత్నం కూడా చేయలేక వెనుకబడుతున్నారు. ఏదైనా పనిని చేసేటప్పుడు మనస్సు లగ్నం చేయాలి. ఫలితంపై ఎక్కువగా దృష్టి పెట్టకూడదు. ఫలితం అనేది సంపూర్ణ ప్రయత్నానికి చివరి మెట్టు. ప్రయత్నమనే మొదటి మెట్టు ఎక్కకుండా ఒకేసారి ఫలితమనే చివరిమెట్టు



ఎక్కాలనుకోవడం ప్రమాదం. గట్టి ప్రయత్నానికి మించిన ప్రత్యామ్నాయం లేదు. ఫలితం కోసం ఎదురు చూడకుండా ప్రయత్నం చేస్తే విజయం లభిస్తుంది. సరియైన ప్రయత్నం లేని ఫలితం నిరాశకు దారితీస్తుంది. కష్టేఫలీ అనే సూక్తిని దృష్టిలో పెట్టుకొని మానవుడు శ్రమించాలి. సంకల్ప బలం ఉండాలి. శ్రమించిన వారికి క్రమంగా ఏకాగ్రత, శ్రద్ధ, మనోనియంత్రణ, కుటుంబ పరిస్థితులు కూడా సహకరిస్తాయి. ఏ కార్యమైనా సాధించాలనుకున్నవారు ముందుగా లక్ష్యం నిర్దేశించుకోవాలి. దానికి తగ్గ సమాచారాన్ని సేకరించుకోవాలి. వనరులను సమీకరించుకోవాలి. కార్యం సిద్ధించేదాకా పట్టుదలతో ప్రయత్నించాలి. నిరంతరం క్రియాశీలుడైఉన్నవాడికి,దైన్యం నిరాశ పొందని వానికి భగవదనుగ్రహం కలుగుతుంది. అటువంటివానికి నైష్కర్మ్యసిద్ధి కలుగుతుంది. జయాపజయాలతో సంబంధం లేకుండా చేయవలసిన పనిని శ్రద్ధాసక్తులతో చేయడమే యోగ సాధన. యత్నేకృతే యది న సిద్ధ్యతి కోఽత్ర దోషః. ప్రయత్నం చేయాలి, చేసినప్పటికి ఆ పనిలో విజయం పొందకలేకపోవడం వల్ల మన దోషమేమీ ఉండదు. నిరంతరం కర్మశీలుడై ఉన్నవానికి సకల దోషాలు తొలగి యోగ సిద్ధి లభిస్తుంది. ఎందరో ఆధునిక వ్యక్తులు తమ అకుంఠిత దీక్షతో, భగవద్భక్తి చేత, సాధన చేత జగద్విఖ్యాతులు అయ్యారు. కాబట్టి సహజమైన మన క్రియాశీలత్వాన్ని, జ్ఞానసముపార్జనకు, భగవత్సేవకు వినియోగించగలిగితే మానవజన్మ సార్థకమౌతుంది. అప్పుడు నరలోకమే స్వర్గలోకమౌతుంది. నిరంతరం ప్రయత్నశీలురుగా ఉంటూ, భగవత్సేవ చేస్తూ దివ్యానందం అనుభవిస్తూ సాధకులు తరించాలని అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను.


> కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన|
>
> మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽ_స్త్వకర్మణి||



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# శ్రీ గణేశ పురాణం



విఘ్నేశ్వరునికి అనంత నామాలున్నాయి. అనేక అవతారాలున్నాయి. ఆయన లీలాగాథలు కూడా అనంతాలే. విఘ్నేశ్వరుడు నిర్గుణుడూ, సగుణుడు కూడా. అటువంటి గణేశ్వరునికి బాగా ఇష్టమైన పదహారునామాలు ఉన్నాయని, ఆ పదహారునామాలని భక్తితో తలచుకొంటే సకలశుభాలు కలుగుతాయని వ్యాసమహర్షి సెలవిచ్చాడు.

విఘ్నేశ్వరుని పదహారునామాలు:

| | |
|---|---|
| 1. సుముఖుడు | 9. ధూమకేతుడు |
| 2. ఏకదంతుడు | 10. గణాధ్యక్షుడు |
| 3. కపిలుడు | 11. ఫాలచంద్రుడు |
| 4. గజకర్ణకుడు | 12. గజాననుడు |
| 5. లంబోదరుడు | 13. వక్రతుండుడు |
| 6. వికటుడు | 14. శూర్పకర్ణుడు |
| 7. విఘ్నరాజు | 15. హేరంబుడు |
| 8. గణాధిపుడు | 16. స్కందపూర్వజుడు |

ఇందులో ఒక్కొక్క నామానికి గల విశేషార్థాలను, వ్యుత్పత్తులను గురించి కూడా తెలుసుకొందాం. గత నెల సంచికలో మనము ఫాలచంద్రుడు అను నామమునకు అర్థాలను, విశేషాలను తెలుసుకున్నాం. ఈ సంచికలో ఇప్పుడు 12వ నామము, 13వ నామము గురించి తెలుసుకుందాం. ఆ నామము గజాననుడు.

గణేశుని పన్నెండవ నామం గజాననుడు-గజముఖం కలిగినవాడు. శివుని గణేశుడు ఎదిరించడం వల్ల, ఆయన ఆగ్రహించి, ఉమాపుత్రుని కంఠాన్ని నఱకి వేయడం, దానికి మాత పార్వతి ఆగ్రహించడం, అప్పుడు శివుడు ఉత్తరం దిక్కుకేసి తలపెట్టుకొని నిద్రిస్తున్న ఏనుగు తలను తెప్పించి వినాయకుని మొండెమునకు అతికించడంతో, అప్పటి నుండి ఆయన గజాననుడు అయ్యాడు. గణపతి సంహితలో ఒక అద్భుతమైన విషయం ఉన్నది - శివుడు పార్వతితో ఇలా అన్నాడు — ఉమా! మానవుని యొక్క, ఏనుగు యొక్క ఆయువు 120 సంవత్సరాలు. కలియుగంలో మానవులు చేసుకొనే పాపాలవల్ల ఈ


# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




ఆయువు క్రమంగా తరిగి పరమాయువు ఇంత అని నిర్ధారించలేని దుఃస్థితి ఏర్పడుతుంది. ఏనుగు తల, మానవ కబంధం కలసిన వినాయకుని శరీరం భక్తితో పూజిస్తే ఈ ఆయువును మానవుడు పొందగలుగుతాడు. ఏనుగులోని సూక్ష్మదృష్టి, బలం, మానవులోని విశిష్టబుద్ధిలక్షణాలు జీవులకు అవసరం అని తెలుపుతూ గణేశుని గజాననుని చేసాను అని పార్వతికి శివుడు తెలియ చేసాడు. ఈ విషయం గణపతి సంహితలోని అయిదవ అధ్యాయంలో ఉంది.

## గణేశుని పదమూడవ నామం వక్రతుండుడు



వంకరగా లేక చుట్టుకొని ఉన్న తొండం కలవాడు అని ఈ నామార్థము. ప్రత్యేకంగా ఈ నామం గురించి ముద్గలపురాణంలో ఒక చరిత్ర ఉంది.

శ్లో|| వక్రతుండావతారశ్చ, దేహానాం బ్రహ్మధారకః
మత్సరాసురహంతా స సింహవాహనగః స్మృతః
(ముద్గలపురాణం – 20 – 5 – 12)

వక్రతుండుడు అనే పేరు సాధారణమైనది కాదు. గణేశుడు మరొక్కసారి అవతరించి పొందిన పేరు. దేహులు బ్రహ్మను ధరించడం కోసం ఈ పేరు ఏర్పడినది. అనగా శరీరం ధరించిన వారికి మేము – శరీరములు ఒకటే, శరీరాలకు మా ఆత్మలకు తేడా లేదు అనే భావన కలుగుతుంటుంది. తమ దేహాలు తమవి అని భావిస్తుంటారు. దీనిని దేహాత్మభావనము అంటారు. ఈ దేహాత్మభావనం వల్లనే జీవులు కర్మలు చేస్తుంటారు. ఆత్మ శరీరంలో ప్రవేశిస్తుందనీ, కొంతకాలం ఆ శరీరంలో ఉండి సుఖదుఃఖాలకు దేహాన్ని గురిచేస్తుందనీ, ఆత్మకు నాశనం లేదనీ, పరమాత్మ నుండి విడివడిన జీవాత్మ తిరిగి పరమాత్మ దగ్గరకు చేరడానికి సాధన అవసరమనీ గ్రహించిన సాధకులకు బ్రహ్మత్వం లభిస్తుంది. అటువంటి బ్రహ్మత్వం ప్రసాదించే అవతారం కనుక గణేశుని వక్రతుండుడు అన్నారు. వక్రతుండం ఓంకారమే. నిత్యం ప్రణవజపం చేసేవాడు పరబ్రహ్మమే అవుతాడు.

పూర్వం ఇంద్రుడు మహాతపస్సు చేసేవారిపై మాత్సర్యం వహించాడు. ఆ మాత్సర్యం అతని శరీరం నుండి బయటకు వచ్చి ఒక మహాసురరూపం ధరించింది. మత్సరత ఎప్పుడూ మంచిది కాదు. అందునా శక్తిమంతులైన వారి మత్సరత లోకవినాశనానికి దారితీస్తుంది. మత్సరత నుండి పుట్టిన రాక్షసునికి మత్సరాసురుడు అని పేరు వచ్చింది. మత్సరుడు దైత్యగురువైన శుక్రుడిని ఆశ్రయించి 'ఓం నమశ్శివాయ' అనబడే ప్రణవపంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశంగా పొందాడు. శివుడి కోసం ఈ మంత్రజపం చేస్తూ కఠోరతపస్సు చేయగా, పార్వతీసమేతంగా, పరమేశ్వరుడు, అసురునికి దర్శనం ఇచ్చాడు. అసురుడు భక్తితో శివుడిని స్తుతించాడు. శివుడు ప్రీతుడై,



తనతోసహా, ఎవరినైనా యుద్ధంలో జయించగలిగే శక్తిని మత్సరాసురునికి ప్రసాదించాడు. మత్సరుడు ఆ వరప్రభావంతో సకలలోకాలనూ జయించాడు. దేవతలు శివుని దగ్గఱ, రక్షించమని మొఱ పెట్టుకోగా, ఇది తెలిసిన రాక్షసుడు శివుడిచ్చిన వరంతో శివుడిని కూడా బంధించాడు. శివుడు దేవతలను వినాయకుని కోసం తపస్సు చేయమన్నాడు. వినాయకుని ప్రసన్నం చేసుకోవడం ఎలా అని భావిస్తున్న దేవతల వద్దకు దత్తాత్రేయుడు వచ్చి, 'గం' అనే గణపతి యొక్క ఏకాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు. దేవతలంతా ఆ బీజాన్ని జపించగా గణపతి వక్రతుండంతో దర్శనమిచ్చి, వక్రతుండావతారంతో మత్సరాసురుడిని జయిస్తానని అభయం ఇచ్చాడు. గణపతి చేతిలో ఓడిపోయి, అసురుని కొడుకులైన సుందరప్రియుడు, విషయప్రియుడు మరణించారు. చివరకు మత్సాసురుడు గణేశుని శరణు కోరి ఆయనకు శాశ్వతభక్తుడై, విమత్సరుడయ్యాడు. లోకాలకు తిరిగి ప్రశాంతత కలిగింది. ఈ విధంగా మత్సరాసురుడిని అణచడానికి వచ్చిన గణేశుని అవతార నామమే వక్రతుండుడు. ఈ నామజపం వల్ల మాత్సర్యం నశిస్తుంది.

ఇదేకాక మరొక అద్భుతగాథ కూడా ఇదే పురాణంలో ఉంది. ప్రళయం పూర్తి అయ్యాక బ్రహ్మదేవుడు పునః సృష్టి చేయాలని సంకల్పించాడు. కానీ సృష్టికార్యానికి అనేక విఘాతాలు కలిగాయి. అప్పుడు ఏం చేయాలో అర్థం కాక బ్రహ్మ పరమాత్ముడైన శ్రీహరిని శరణు వేడగా, విఘ్నేశ్వరుని అనుగ్రహం లేనంత వరకు విఘ్నాలు తప్పవనీ, గణేశుని కోసం తపస్సు చేయమనీ చెప్పి, శ్రీమహావిష్ణువు గణపతి మంత్రాలలో గొప్పదైన షడక్షరీమంత్రాన్ని ఉపదేశించాడు. ('వక్రతుండాయ హుమ్') గణేశుని ఈ షడక్షరీమంత్రజపం వల్ల విఘ్నేశుడు ప్రసన్నుడై వక్రతుండ నామంతో వక్రతుండావతారంతో ప్రత్యక్షమై, బ్రహ్మకు సృష్టికార్యసామర్థ్యంతో బాటుగా వివిధ వరాలు ప్రసాదించాడు. సృష్టికార్యం ఏ ఆటంకం లేకుండా సాగింది. కానీ అప్పటికే అనగా గణపతి దర్శనానికి ముందే, తన పనులు సరిగా సాగడం లేదనే భయంతో బ్రహ్మ కంపించడం వల్ల, ఆయన శరీరం నుండి దంభుడు అనే రాక్షసుడు జన్మించాడు. వాడు పెరిగి పెద్దవాడై శుక్రుని ఆశీస్సులతో బ్రహ్మ గుఱించి తపస్సుచేసాడు. బ్రహ్మ వాడికి ఎక్కడా ఏ విధమైన భయం ఉండదని వరమిచ్చాడు. దంభుడు ఒక మహానగరాన్ని నిర్మించుకొని శుక్రాచార్యుని కులపురోహితునిగా చేసుకొని సకల దైత్యులకు రాజై, తన వీరబలంతో సర్వలోకాలనూ జయించాడు. అప్పుడు దేవతలు ఈ రాక్షస బాధలు తట్టుకోలేక బ్రహ్మను రక్షించమని ప్రార్థించగా, బ్రహ్మ దేవతలతో కలసి 'గం' అనబడే ఏకాక్షర బీజం జపించి విఘ్నేశుని ప్రసన్నుని చేసుకొన్నాడు. గణపతి వారందరికీ ప్రత్యక్షమై, అభయం ఇచ్చాడు. ఇంద్రుని తన దూతగా చేసుకొన్నాడు. యుద్ధమో లేక గణేశుని శరణుకోరడమో నిశ్చయించుకోమని తన మాటగా దంభునికి చెప్పమని ఇంద్రునితో అన్నాడు. ఇంద్రుడు గణేశదూతయై దంభుని వద్దకు వెళ్ళి గణపతి ఆజ్ఞను వివరించాడు. అది విన్న దంభుడు దేవతలను సర్వనాశనం చేస్తానని పలికి, అనంతరం గురువైన శుక్రాచార్యుని వద్దకు వెళ్ళి, 'గణపతి ఎవరని?' అడిగాడు సర్వలోకేశ్వరుడైన గణపతి తత్త్వాన్ని వివరించి, గణేశునికి భక్తుడవ్వడమే మంచిదని శుక్రుడు శిష్యునికి సూచించాడు. దైవానుగ్రహం వల్ల గణేశునిపై దంభునికి శ్రద్ధాభక్తులు కుదిరాయి. అతడు వక్రతుండునికి నమస్కరించి, ఆయనకు శిష్యుడు, భక్తుడు అయి, ఆయన ఆజ్ఞను పాటించి, దేవతలకు వారి రాజ్యం ఇచ్చి, శాశ్వతంగా గణపతి సన్నిధిలో ఉండిపోయాడు. ఈ దంభుడు. గణేశభక్తి లేని వారిలో అహంకార రూపంలో నివసిస్తుంటాడు. వక్రతుండనామం జపించే వారు దంభము అనబడే దుర్గుణం నుండి బయటపడతారు. వక్రతుండుడు అనగా సర్వాధారమైన ఓంకారమే. ఈ నామాన్ని 21 దినములు భక్తితో జపించినవారిని వక్రతుండుడు శీఘ్రకాలంలో అనుగ్రహించి సకల శుభాలు ప్రసాదిస్తాడు.

.... ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# శ్రీ వేంకటేశ్వర రహస్యము



పూర్వజన్మ సుకృతం వల్ల శ్రీవేంకటేశ్వర విలాసాన్ని లోకానికి సులభశైలిలో అందించిన పరమాత్మ స్వరూపుడు,సమర్థగురుడు, త్రిభాషామహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి అయిన బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు నాకు జనకులయ్యారు. తల్లి శ్రీమతి రంగవేణి కూడా వేంకటేశ్వర భక్తురాలే. అందుకే శ్రీవేంకటేశ్వరుని లీలా రహస్యాలు వ్రాసే భాగ్యం నాకు కలిగింది. సప్తగిరులు అనేక దివ్యరహస్యాలకు నిలయాలు. యుగయుగాలుగా బ్రహ్మర్షులు, దివ్యర్షులు, మహర్షులు, రాజర్షులు, ఋషులు, మునులు, సాధకులు, యోగులు ఈ కొండపై సాధనలు చేస్తూనే ఉన్నారు. ఆ సాధనలన్నీ రహస్యాలే. కొండలలోని గుహలు రహస్యాలే. జలపాతాలు రహస్యాలే. వృక్షాలు, జంతువులు, కీటకాలు, ఇంతెందుకు ఈ కొండలోని అణువులన్నీ రహస్యాలే. ఆ రహస్యాలలో భగవంతుడు అందించిన మేరకు కొన్ని భక్తులకు అందించే ప్రయత్నం చేస్తాను.



వేంకటేశ్వరుని వైభవానికి సంబంధించిన రహస్యాలను తెలుసుకొంటున్నాం, అందులో భాగంగా తొండమానుని పూర్వజన్మ వృత్తాంతము కొంత తెలుసుకున్నాము ఈ సంచికలో మరిన్ని విషయాలు తెలుసుకొందాం.

## తొండమానుని పూర్వజన్మ వృత్తాంతము

తొండమానుడు విశ్వకర్మను వెంటబెట్టుకొని, వేంకటాద్రిపై పూర్వజన్మలో తాను నిర్మించిన బావిని పునర్నిర్మించమనీ, స్వామివారికి దేవాలయం అపూర్వంగా నిర్మించమనీ వేడుకొన్నాడు. విశ్వకర్మ శిల్పశాస్త్ర నైపుణ్యం ప్రదర్శిస్తూ, మూడు ప్రాకారాలు, రెండు గోపురాలు, సప్తద్వారాలు, ఆస్థాన మంటపం, ముఖమంటపం, గోశాల, ధాన్యశాల, వంట ఇల్లు, వస్త్రగృహం, ఆభరణాల గృహం, పరిమళద్రవ్య గృహం, వివాహ మంటపం, తైలం ఉంచే నూయి, నేతి నూయి, భక్ష్యశాల, నైవేద్యశాల, అన్నశాల యొక్క అగ్రభాగంలో భూమి తీర్థ కూపం (భూ తీర్థం ఉండే నూయి) నిర్మించాడు. వాటి మధ్యలో ఎత్తైన విమానాన్ని నిర్మించాడు. విమానంపై బంగారు కలశాలు స్థాపించాడు. విశాలంగా ఉండే మూడు వీధులు నిర్మించాడు. క్రింది నుండి కొండమీదికి వచ్చేవారికోసం మెట్లదారిని, దారిలో కూర్చొనడానికి మంటపాలు, విశ్రాంతి తీసుకొనేవారికోసం నీటి మడుగులు, ఆహారశాలలు నిర్మించాడు. ఈ విధమైన అద్భుత నిర్మాణాలు పూర్తిచేసి,




కొండదిగి, శ్రీహరి దగ్గఱకు వెళ్ళి నమస్కరించి తొండమానుడు, విశ్వకర్మ అనుగ్రహంతో దేవాలయ నిర్మాణం పూర్తి అయిన విషయం తెలియజేసాడు. ఆపై ఇలా ర్థించాడు - శ్రీమన్నారాయణా! నీ దివ్యానుగ్రహంతో వేంకటశైలంపై దేవాలయ నిర్మాణం, తక్కిన దివ్య ప్రబంధాలు పూర్తి అయ్యాయి. ఇక నీవు సతీ సమేతుడవై అందులో కొలువై ఉండడం ఒక్కటే మిగిలింది. ఇంతకాలం కొండపై శ్రీకృష్ణవిగ్రహాన్ని నీ స్వయంభూ మూర్తిని పూజించాను. ఇక నీవు నూతనంగా వేంకటేశ్వర రూపధారివై నేను క్రొత్తగా కట్టించిన ఆలయంలో కొలువై భక్తులను అనుగ్రహించు. తొండమానుని ప్రార్థనం ఆలకించాడు శ్రీనివాసుడు. తొండమానునితో ఇలా అన్నాడు — "భక్తా! శుకుడు, అగస్త్యుడు నాతో రాగా ఇప్పుడే బయలుదేరి వేంకటాద్రికి వస్తాను. శుభముహూర్తంలో ఆనందనిలయంలో ప్రవేశిస్తాను. నీవు నాకు దారి చూపిస్తూ ముందుగా నడు". తొండమానుడు స్వామికి దారి చూపుతూ, సర్వులకు దారిచూపే స్వామిని తోడ్కొని ప్రయాణమయ్యాడు. వైఖానసవిప్రముఖ్యులు, శుకుడు, అగస్త్యుడు శ్రీనివాసుని వెంట పయనమయ్యారు. ఆ సమయంలో వసుదానుడు పద్మావతీశ్రీనివాసులు, కొండపైకి వెళ్ళిపోతే, తనకు, తనరాజ్యానికి దూరమై పోతారనే బెంగతో అక్కడకు వచ్చాడు. పద్మావతి అంటే వసుదానునికి పరమప్రీతి. అక్కగారిపై ప్రీతితో బాటుగా బావగారిపై భక్తి కూడా అమితమే. అందుకే అతడు, వారి దగ్గఱకు వచ్చి భక్తితో నమస్కరించి, తనకు దూరంగా వెళ్ళవద్దని అభ్యర్థించాడు. అప్పుడు శ్రీనివాసుడు, అతనిని ఓదారుస్తూ ఇలా అన్నాడు- నాయనా! చింతించకు. శేషాద్రి నీకు ఎక్కువ దూరం కాదు. మేమిద్దరం అక్కడ కొలువై, నీకు తలచినప్పుడు దర్శనమిస్తాం. నీకు లభించిన రాజ్యాన్ని ధర్మబద్ధంగా పరిపాలించు. పూజ్యులైన వారిని ఆదరించి పూజించు. పద్మావతీదర్శనానికి తఱచుగా వస్తుండు. ధర్మం తప్పక దానాలు, యజ్ఞాలు చేసి తరించు. నేను భక్తులకు దూరంగా ఉండను. తలచినప్పుడల్లా హృదయంలోనే దర్శనమిస్తుంటాను. వేంకటాద్రి నా క్రీడా స్థలం. కనుక అక్కడ కొలువై ఉంటాను. శ్రీనివాసుని మాటలకు వసుదానుడు సంతోషించాడు. నిశ్చింతుడయ్యాడు. అక్కగారైన పద్మావతికి వివిధ వస్త్రాలు, ఆభరణాలు ఇచ్చాడు. అనంతరం స్వామివారు వేంకటాద్రి చేరుకొన్నాడు. నరులు సురలు మంగళవాద్యాలు మ్రోగిస్తుండగా, వికృతి నామ సంవత్సరంలో, పాడ్యమీతిథినాడు, గురువారం, అశ్వనీ నక్షత్రం ఉన్న దినమున, శ్రీనివాసుడు ఆనందనిలయంలో ప్రవేశించాడు. బ్రహ్మ, ఇంద్రుడు మున్నగువారు స్వామిపై పూలవాన కురిపించారు. ప్రధానఋత్విక్కు ద్వారపాలకులను ముందుగా ప్రతిష్ఠించి, అనంతరం శ్రీహరిని పద్మపీఠంపై [తామరపూవు ఆసనం] నిలబెట్టి, ప్రతిష్ఠా విధిని నిర్వహించాడు. శ్రీహరి తనయంతతాను పద్మపీఠంపై నిలబడ్డాడు. ఎడమచేతిని నడుము దగ్గఱ ఉంచాడు. కుడి పాదాన్ని కుడి చేతితో చూపిస్తూ, బ్రహ్మాదులతో ఇలా అన్నాడు — ఇదే నా దివ్యమంగళరూపం. ఈ రూపంతో నా అంతట నేను విగ్రహరూపం ధరిస్తున్నాను. ఈ నా రూపం. ఇదే పరమపదం అని తెలియజేస్తున్నది. నా పాదాన్ని ఆశ్రయించమని చెపుతున్నది. ఈ రూపదర్శనం, శాశ్వత ముక్తిని ప్రసాదిస్తుంది. అప్పుడు దేవతలు శ్రీహరి ధరించిన దివ్యవిగ్రహరూపాన్ని చూచి పులకించిపోయారు. కలియుగవాసులీరూపాన్ని చూచి ధన్యులౌతారని భావించారు. బ్రహ్మ రెండు అఖండ దీపాలను సృష్టించి, విష్ణు సన్నిధిలో ఉంచి, దీపారాధనం చేసి ఇంద్రాది దేవతలతో ఇలా అన్నాడు — "కలియుగధర్మం నడచినంతకాలం ఈ రెండు దీపాలు శ్రీవిష్ణుసన్నిధిలో ఉంటాయి. ఈ రెండు దీపాలు ఇక్కడ వెలుగుతున్నంతకాలం అనగా అర్చకులు దీనిని ఆరకుండా చూసినంతకాలం ఈ దివ్య విమానం నిలబడి ఉంటుంది. కలియుగంలో అధర్మం బాగా పెరిగినప్పుడు, యుగం నశించే సమయం వచ్చినప్పుడు దీపాలు రెండూ ఆరిపోతాయి. అప్పుడు ఆనందనిలయంపై కల విమానం విరిగి నేలపై పడుతుంది. విమానం పడిపోగానే శ్రీవేంకటేశ్వరుడు వేంకటాద్రి విడచి, వైకుంఠానికి వెళ్ళిపోతాడు. అప్పుడు భూమిపై అగ్నివర్షం కురిసి

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



సర్వప్రాణులూ నశిస్తారు. ఆపై ఘోరవర్షం కురుస్తుంది. భూమి నీటిలో మునిగిపోతుంది. అనంతరం మరల భూమిని శ్రీహరి ఉద్ధరిస్తాడు అప్పుడు కృతయుగం ప్రారంభమౌతుంది. ధర్మదేవత తిరిగి నాలుగు పాదాల మీద నడుస్తుంది. మరలా కలియుగం వచ్చినప్పుడు మాత్రమే వేంకటేశ్వర నామంతో శ్రీహరి వేంకటాద్రిని చేరి, భక్తులను అనుగ్రహిస్తాడు. అన్ని యుగాలలోను కలియుగానికి ఒక ప్రత్యేకత ఉంది. తక్కిన యుగాలలో పుణ్యం, దానం చేసినవానికే ఫలం లభిస్తుంది. కలియుగంలో దానం చేసినవానికి, చేస్తానని పలికిన వాడికి కూడా పుణ్య ఫలం లభిస్తుంది. కలియుగంలో నామస్మరణం అత్యంత పుణ్యఫలం ఇస్తుంది. ఏడు కొండలవాడు ప్రత్యక్షదైవం. గోవిందనామస్మరణం నిరంతరం చేసేవారిని, సకలపాపవిముక్తులను చేసి, శీఘ్రంగా అనుగ్రహిస్తాడు. కనుక కలియుగవాసులను కొండ ఎక్కుతున్న సమయంలో, గోవిందనామస్మరణం చేయమని మీరందరూ ప్రోత్సహించండి."



...ఇంకా ఉంది

*****

ఏటి సూతకం ఉన్నవారు తీర్థ యాత్రలు, నిత్య పూజలు, ఆలయ దర్శనం చేసుకోవచ్చు. చనిపోయిన వారికి మాత్రం తప్పకుండా పితృకార్యాలు నిర్వహించాలి. క్షేత్రాలలో కూడా మాసికాలు పెట్టవచ్చు.కేవలం ప్రత్యేక పూజలు, శుభకార్యాలు చేసుకోరాదు. - -శ్రీ గరుడపురాణం

## ఋషి చరిత్ర



### వింధ్య గర్వభంగం

అగస్త్యుని చూడగానే బాగా పొడవుగా పెరిగి ఉన్న వింధ్య పర్వతం ఒక్కసారిగా వంగి వినయంగా నమస్కరించింది. అగస్త్యుడు వింధ్య పర్వతాన్ని చూచి, "నాయనా! నీవు అలాగే వంగి ఉండు. నా భార్య వృద్ధురాలు. కొండలు ఎక్కలేక బాధ పడుతున్నది. వంగి ఉన్న నువ్వు అలానే ఉండు. మేము నీ కొండ ఎక్కి అవతలి వైపుకు వెళతాము. మేము మళ్లీ తిరిగి వచ్చేవరకు నీవు అలానే వంగి వుండు. నా మాట కాదని పైకి లేచావో! తెలుసుగా నా సంగతి" అని అనగానే, వింధ్య పర్వతం "అయ్యా! మీరు చెప్పాక కూడా తలెత్తుతానా! కొంచెం కొంచెం కళ్ళెత్తి మీరు ఎప్పుడు వస్తారా! అని ఎదురుచూస్తూ ఉంటాను" అని అన్నాడు. అప్పుడు అగస్త్యుడు, "మంచిది. అలానే పడి ఉండు" అని వింధ్య పర్వతాన్ని దాటి వెళ్లిపోయాడు. ఆ తర్వాత అగస్త్యుడు లోపాముద్ర తో, "ఇది ఆ దేవతలంతా కలిసి నన్ను కాశీ నుంచి పంపించివేయడానికి పన్నిన కుట్ర కాకపోతే, వాళ్లు





వింధ్య పర్వతం యొక్క గర్వం ఎలా అణచగలరు! నేను మళ్లీ తిరిగి కాశీ నగరానికి వస్తే ఈ వింధ్య పర్వతం తిరిగి పైకి లేస్తుంది. అప్పుడు సూర్యరథ గమనం ఆగిపోతుంది. ఇప్పుడు వింధ్య పర్వతం వంగింది. కాబట్టి సూర్యుడు యథావిధిగా తిరగ గలిగినాడు. దానితో లోకంలో పగలు, రాత్రి కాల చక్రం యథావిధిగా తిరిగింది" అని అన్నాడు. ఆ తర్వాత కాశీ క్షేత్ర మాహాత్మ్యమును తెలుపుతూ, "ఎవరైనా కాశీలో నివసించాలి అనుకుంటే వారికి నిత్యం విఘ్నములు కలుగుతాయి. అలా విఘ్నములు కలిగించే వారే సంభ్రముడు, విభ్రముడు. సంభ్రముడు అనే ఆయన మొట్ట మొదట కాశీ నగరానికి వెళ్లిన వారికి కాశీ మీద అసహ్యం కలిగేలా చేస్తాడు. అప్పుడు మనం ఇదంతా ఆ విశ్వేశ్వరుడి పరీక్ష అనుకుని అక్కడ నుంచి కదలకుండా ఉంటే, విభ్రముడు వచ్చి ఆదుకుంటాడు. కావున సంభ్రమ, విభ్రముల పరీక్షలకి గురికాకుండా ఉండటానికి కాశీలో ఉన్నంత సేపూ 'శివ శివ శివ శివ శివ' అని అనుకుంటూ ఉండాలి. శివా! నువ్వు ఎన్ని పరీక్షలు పెట్టినా మేము కాశీని విడిచివెళ్లం అని ఆ విశ్వేశ్వరుడిని గట్టిగా పట్టుకోవాలి. కాశీలో ఉన్నంత సేపు కాశీని విసుగుకోకుండా, విశ్వేశ్వరుడికి వ్యతిరేకంగా మాట్లాడకుండా, "ఆయనే సర్వేశ్వరుడు" అని అనుకుంటూ ఆయనకు సంపూర్ణ శరణాగతిని పొందిన వారు కాశీ నుంచి బయటకు వెళ్ళరు" అని పలికాడు. ఆ తర్వాత అగస్త్యుడు లోపాముద్ర తో ఇలా అంటాడు, "మనం ఇన్ని సంవత్సరాలుగా కాశీలో ఉన్నా కూడా 'మనం ఇంక కాశీ వదిలి వెళ్లముగాక వెళ్లము' అని అనుకోకపోవడమే పొరపాటైంది కదా!" అని అగస్త్యుడు ఎంతగానో చింతించాడు.

..ఇంకా ఉంది

*****

"ఒక సంవత్సరం పాటు పురాణం విన్న వాడి శరీరం సాలగ్రామంతో సమానం"

"సంపూర్ణముగా మహాభారతం విన్న వారి శరీరం బదరిలోని నారాయణుని తో సమానం"

"రామాయణం సంపూర్ణముగా విన్న వారి శరీరం సరయు నది తో సమానం"

"భాగవతం సంపూర్ణముగా విన్న వాని శరీరము వైకుంఠముతో సమానము"

"రోజు భగవన్నామ స్మరణ చేయటం ద్వారా మన శరీరం కూడా దేవాలయం లో ఉన్న స్వయంభు విగ్రహం గా మారుతుంది"

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః | శ్రీ మాత్రేనమః | శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము.

## 313 - రమా - [ఓం ఐం హ్రీం శ్రీం రమాయై నమః]

రమా అంటే లక్ష్మి. లక్ష్మీదేవి రూపంలో భక్తులను అనుగ్రహిస్తున్నది అమ్మవారే. శ్రీమద్దేవీభాగవతంలో తృతీయస్కంధంలో త్రిమూర్తులను తన వద్దకు రప్పించుకొని తన నుండి, లక్ష్మి వాణీ పార్వతులను సృష్టించి లక్ష్మిని విష్ణువునకు, వాణిని బ్రహ్మకు, పార్వతిని శివునకు భార్యగా ఇచ్చినట్లు వ్రాయబడింది. సూత సంహితలో వాక్కు మున్నగు రూపాలలో నర్తకిలా ప్రకాశించే స్వరూపాన్ని లక్ష్మి లేక రమ అంటారనీ, ఆ రమ శ్రీజగన్మాతృ కళ . రమ అనగా సంపద, శోభ, కాంతి అని కూడా అర్థాలున్నాయి. సంపదలు, శోభలు, కాంతి అన్నీ తానే అయిన అమ్మవారిని రమ అని పిలుస్తారు.



మంత్రప్రయోగవిధానం — ఫలితం : శరీరం పాలిపోయి. అసహ్యంగా మారిపోయినప్పుడు ఈ మంత్ర జపం చేస్తే, తిరిగి కాంతియుక్తమై, శోభతో నిండుతుంది. తిరిగి శరీరం అందంగామారుతుంది. శరీరం పుట్టుకతో ఆకర్షణ లేనిదైనప్పటికీ ఈ మంత్రజపం వల్ల శరీరానికి ఆకర్షణ కలుగుతుంది. 63 దినాలు ఈ మంత్రాన్ని జపించాలి. అమ్మవారిని మందారపుష్పాలతో పూజించాలి. గుడాన్నం లేదా కట్టుపొంగలి నైవేద్యంగా పెట్టాలి. గుడాన్నం అనగా బెల్లంతో వండిన అన్నం మాత్రమే. పంచదార వేసిన అన్నం పనికిరాదు. అమ్మవారిని పూజించిన పూలను మరునాడు కొద్దిగా నీళ్ళలో నానబెట్టి, ఆపై ఆ పూలరసాన్ని ముఖానికి రాసుకొంటే ముఖం కాంతివంతమవుతుందనీ, సంపదలు లభిస్తాయనీ మంత్ర శాస్త్రాలు చెపుతున్నాయి. కనీసం మంత్రజపం చేసినా ఫలితం ఉంటుంది.


... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

*****



## పురాణం లో మహిళలు

### ఊర్మిళ



రామాయణంలోని పాత్రలలో ఊర్మిళ పాత్ర కీలకమైనది. ఆమె జనకమహారాజు యొక్క చిన్న కుమార్తె మరియు సీత సోదరి. ఆమె భర్త లక్ష్మణుడు. ఆమె ఆదిశేషుని అవతారమైన లక్ష్మణుడిని వివాహం చేసుకున్న నాగదేవి అవతారంగా నమ్ముతారు. మిథిలా రాజు జనకమహారాజు, అతని భార్య సునయిన. వారికి సంతానము లేరు. ఒక రోజు అతనికి భూమి దున్నుతుండగా ఒక కుమార్తె లభించింది. ఇది భగవంతుని వరం అని భావించి, ఆమెను తన కుమార్తెగా స్వీకరించి, ఆమెకు సీత అని పేరు పెట్టాడు. సీతను స్వీకరించిన కొన్నేళ్ల తర్వాత భగవంతుని దయతో ఊర్మిళ అనే కుమార్తెను పొందాడు. ఒక రోజు ఊర్మిళ అక్క సీత స్వయంవరం నిర్వహించబడి, అయోధ్య యువరాజు శ్రీరామునితో సీత వివాహమైంది. సీత తండ్రి జనకమహారాజు అయోధ్యతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడానికి తన కుమార్తె ఊర్మిళ, మరియు తన తమ్ముడైన కుశధ్వజునుని కుమార్తెలైన మాండవి, శ్రుతకీర్తులను శ్రీరాముని ముగ్గురు తమ్ముళ్లకు ఇచ్చి వివాహము నిశ్చయించాడు. ఆ విధంగా ఊర్మిళ శ్రీరాముడి తమ్ముడు మరియు ఆదిశేషుని అవతారం అయిన లక్ష్మణుడిని వివాహం చేసుకుంది. వివాహానంతరం ఊర్మిళ తన నలుగురు సోదరీమణులతో కలిసి అయోధ్యలోని రాజభవనానికి వచ్చి సంతోషంగా జీవించడం ప్రారంభించింది. కైక వరాల కారణంగా శ్రీరామునికి పద్నాలుగు సంవత్సరాల వనవాసం విధించబడింది. సీత కూడా శ్రీరాముడితో పాటు వనవాసం చేయాలని నిర్ణయించుకుంది. ఊర్మిళ భర్తయైన లక్ష్మణుడు కూడా తన అన్నకు, వదినకు సేవ చేసేందుకు పద్నాలుగేళ్లుగా అరణ్యవాసానికి వెళ్తున్నాడని తెలుసుకున్న ఊర్మిళ, ఆమె తన భర్తతో కలిసి వెళ్లేందుకు సిద్ధమైంది.





లక్ష్మణుడు తనతో పాటు అడవిలోకి రావద్దని అనడంతో ఊర్మిళ మనసు కలత చెంది కారణం అడిగింది. లక్ష్మణుడు అరణ్యవాసంలో ఉన్న తన సోదరుడు మరియు వదినకు సేవ చేయబోతున్నానని, ఊర్మిళ రావడం వల్ల వారితో కలిసి నడవడానికి ఆటంకం కలిగుతుందని చెప్పాడు. దీనితో పాటు, రాజభవనంలో ఉంటూ శ్రీరాముని తల్లి కౌసల్యను చూసుకునే బాధ్యతను ఊర్మిళకు లక్ష్మణుడు అప్పగించాడు. భర్త యొక్క మాటలు ఊర్మిళ హృదయాన్ని తాకాయి. ఆమె తన బాధ్యతగా అన్నింటిని త్యాగం చేయడానికి అంగీకరించింది. పద్నాలుగేళ్లపాటు భర్త నుంచి విడిపోయిన బాధతో అత్తగారికి సేవ చేయాల్సి వచ్చింది. దానికి సైతం ఊర్మిళ నవ్వుతూ అంగీకరించింది. దీని గురించి రెండు భిన్నమైన కథలు ప్రచారంలో ఉన్నాయి. జనాదరణ పొందిన కథ ప్రకారం, ఊర్మిళ పద్నాలుగు సంవత్సరాలు మాతా కౌసల్యకు, ఇతర అత్తలకు చాలా సేవ చేసింది. మరొక కథ ప్రకారం, లక్ష్మణుడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు, మొదటిరోజు రాత్రి నిద్రదేవత అతని వద్దకు వచ్చింది. లక్ష్మణుడు అరణ్యంలో రాత్రి సమయంలో తన అన్నకు, వదినకు రక్షకునిగా నిద్రపోకుండా ఉన్న సమయంలో అక్కడికి నిద్రాదేవి ప్రత్యక్షం అవుతుంది. లక్ష్మణుడు నిద్రాదేవితో ఇలా అన్నాడు — " తన అన్న, వదినలకు రక్షకునిగా ఉండటానికి పద్నాలుగు సంవత్సరాలు నిద్రపోకుండా ఉండే వరాన్ని ప్రసాదించమని వేడుకున్నాడు. నిద్రాదేవి లక్ష్మణుడితో ఇలా అన్నది — "లక్ష్మణా! నీ స్థానంలో ఎవరైనా పద్నాలుగు సంవత్సరాలు నిద్రించగలిగితే, నీకు ఈ వరాన్ని ప్రసాదిస్తానని తెలిపింది. అప్పుడు లక్ష్మణుడు నా భార్యయైన ఊర్మిళ ఆ పని చేస్తుందని తెలిపాడు. నిద్రాదేవి ఊర్మిళ వద్దకు వెళ్ళి లక్ష్మణుడి యొక్క వరాన్ని గురించి తెలుపుతుంది. అది విన్న ఊర్మిళ తన భర్త యొక్క మాటను వెంటనే అంగీకరించింది. ఆ తర్వాత లక్ష్మణుడు ఆ వరప్రభావం వల్ల పద్నాలుగేళ్లు నిద్రపోలేదు. తన భార్యయైన ఊర్మిళ పద్నాలుగేళ్లు నిద్రపోయింది. లక్ష్మణుడు అరణ్యవాసం నుండి తిరిగి వచ్చిన తరువాత, ఊర్మిళకు ఇద్దరు కుమారులు కలిగారు. వారి పేర్లు అంగదుడు మరియు చంద్రకేతువు.



వాల్మీకి రామాయణంలో ఊర్మిళకు లక్ష్మణుడితో వివాహానంతరం అయోధ్యానగరంలో గృహప్రవేశాది విధి పూర్వక కార్యకలాపాలు పూర్తయిన తర్వాత ఊర్మిళ పాత్ర మనకు కనపడదు. జానపదులు ఊర్మిళను ప్రధానంగా చేసుకొని చాలా రకాల కావ్యాలు రచించారు. సుప్రసిద్ధ హిందీ కవి మైథిలీశరణ్ గుప్త 'సాకేత్' , ' పంచవటి' వంటి కావ్యాలలో ఊర్మిలను అపురూపమైన నాయకగా సృష్టించి రామ కథాగమనానికి ప్రధాన పాత్ర ఊర్మిళ అన్నంతగా పాత్రను తీర్చిదిద్దారు. 'ఊర్మిళాదేవి నిద్ర', 'లక్ష్మణ దేవర నవ్వు' వంటి అనేక జానపద గేయాలు తెలుగువారికి ఊర్మిళ పైన ఉన్న అభిమానాన్ని, ఆరాధన భావాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి. ఒకవైపున హిందీ కవుల ప్రభావం మరొకవైపున జానపద గేయాల ప్రభావం తెలుగు కవులను ప్రేరేపించగా తెలుగు సాహితీ జగత్తులో ఊర్మిళ గురించి రకరకాలైనటువంటి కావ్యాలు వచ్చాయి. రాముని సేవకై పతిదేవుని పంపి 14 సంవత్సరాలు ఏకభుక్తగా, నిద్రామూర్తిగా, యోగినిగా తన్ను తాను కృశింప చేసుకొని తపస్వినిగా రూపొందిన ఊర్మిళకి వాల్మీకి చేసిన నామధేయం కూడా సార్థకం అని చెప్పవచ్చును.

*****



## స్తోత్రమాలిక

### శ్రీ చంద్రశేఖరాష్టకం

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!

1. రత్నసాను శరాసనం రజతాద్రిశృంగ నికేతనం !

శింజినీకృత పన్నగేశ్వర మచ్యుతానల సాయకమ్ !

క్షిప్రదగ్ధపురత్రయం త్రిదశాలయై రభివందితం !

చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః ||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!

2. పంచపాదప పుష్పగంధి పదాంబుజ ద్వయశోభితం !

ఫాలలోచనజాత పావక దగ్ధమన్మథ విగ్రహమ్ !

భస్మదిగ్ధ కళేబరం భవనాశనం భవమవ్యయం !

చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః ||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!



3. మత్తవారణ ముఖ్యచర్మ కృతోత్తరీయ మనోహరం !

పంకజాసన పద్మలోచన పూజాతాంఘ్రి సరోరుహమ్ !

దేవసింధు తరంగశీకర సిక్త శుభ్ర జటాధరం !

చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః ||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!

4. యక్షరాజసఖం భగాక్షహరం భుజంగ విభూషణం !

శైలరాజసుతా పరిష్కృత చారువామ కళేబరమ్ !

క్ష్వేల నీలగళం పరశ్వథధారిణం మృగధారిణమ్ !

చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్య తి వై యమః ||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!

5. కుండలీకృత కుండలీశ్వర కుండలం వృషవావానం !

నారదాదిమునీశ్వరస్తుత వైభవం భువనేశ్వరమ్ !

అంధకాంతకమాశ్రితామరపాదపం శమనాంతకం !

చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!



6. భేషజం భవరోగిణామఖిలాపదమపహారిణం !

దక్షయజ్ఞవినాశనం త్రిగుణాత్మకం త్రివిలోచనమ్ !

భుక్తిముక్తిఫలప్రదం సకలాఘసంఘ నిబర్హణం !

చంద్రశేఖరమాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః ||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!

7. భక్తవత్సలమర్చితం నిధి మక్షయం హరిదంబరం !

సర్వ భూతపతిం పరాత్పరమప్రమేయ మనుత్తమం !

సోమవారిణ భూహుతాశన సోమపానిలఖాకృతిం !

చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్య తి వై యమః||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!

8. విశ్వ సృష్టివిధాయినం పునరేవ పాలనతత్పరం

సంహరంతమపి ప్రపంచ మశేషలోక నివాసినమ్ !

క్రీడయంత మహర్నిశం గణనాథయూథ సమన్వితం !

చంద్రశేఖర మాశ్రయే మమ కిం కరిష్యతి వై యమః||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!



౮. మృత్యుభీత మృకండ సూనుకృతస్తవం శివసన్నిధౌ !

యత్రకుత్ర చ యః పఠేత్ నహి తస్య మృత్యు భయం భవేత్ !

పూర్ణమాయురరోగతామఖిలార్థ సంపద మాదరం !

చంద్రశేఖర ఏవ తస్య దదాతి ముక్తి మయత్నతః ||

చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమామ్!


చంద్రశేఖర! చంద్రశేఖర! చంద్రశేఖర! రక్షమామ్!

|| ఇతి శ్రీచంద్రశేఖరాష్టకం సంపూర్ణం||



*****







ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



# పండుగ విశేషాలు

## కార్తికమాస వైశిష్ట్యము

ఆదిదంపతుల పాదపద్మాలకి భక్తిశ్రద్ధలతో నమస్కారం చేసుకుందాం. న కార్తిక సమో మాసః. మాసాలలో కార్తికమాసంకి సమానమైన మాసం లేదని శాస్త్రం చెపుతుంది. మన మాసాలన్నింటికి ఒక ప్రత్యేకత ఉన్నది. పూర్ణిమ నాడు ఏ నక్షత్రం ఉంటే ఆ నక్షత్రాన్ని బట్టి ఆ మాసాలకి ఆ పేరున పేర్లు పెట్టారు. ఉదాహరణకి, చిత్త అనే ఒక నక్షత్రం పూర్ణిమ నాడు ఉంటే అది చైత్ర మాసం. అదే విశాఖ నక్షత్రం పూర్ణిమ నాడు ఉంటే వైశాఖ మాసం. జేష్ఠా నక్షత్రం పూర్ణిమ నాడు ఉంటే జేష్ఠ మాసం. పూర్వాషాఢ లేక ఉత్తరాషాఢ అనే నక్షత్రం పూర్ణిమ నాడు ఉంటే, ఈ పూర్వాషాఢ కానీ ఉత్తరాషాఢ కానీ ఆషాఢ ఉంది కదా, ఈ ఆషాఢ పూర్ణిమనాడు ఉంటే అది ఆషాఢ మాసం. ఆ తర్వాత శ్రవణ నక్షత్రం పూర్ణిమ నాడు ఉంటే శ్రావణం. పూర్వాభాద్ర లేక ఉత్తరాభాద్ర అనే నక్షత్రం పూర్ణిమనాడు ఉంటే భాద్రపద మాసం. అశ్విని నక్షత్రం పూర్ణిమ నాడు ఉంటే ఆశ్వీయుజ మాసం. కృత్తిక అనే నక్షత్రం పూర్ణిమనాడు ఉంటే అది కార్తికమాసం. అందుకే కార్తీకం అని దీర్ఘం అనకూడదు సుమా! కార్తికం అనాలి. కృత్తిక పూర్ణిమలో ఉంది కనుక కార్తికం. ఆ తరువాత మృగశీర్ష లేక మృగశిర అనే నక్షత్రం పూర్ణిమనాడు ఉంటే మార్గశీర్ష లేక మార్గశిర మాసం. పుష్యమి నక్షత్రం పూర్ణిమనాడు ఉంటే పుష్య మాసం. మఖ అనే నక్షత్రం పూర్ణిమనాడు ఉంటే మాఘం లేక మాఖం. ఉత్తరఫల్గుణి లేక పూర్వఫల్గుణి, వ్యవహారంలో పూర్వఫల్గుణిని పుబ్బ అంటాం.ఉత్తరఫల్గుణిని ఉత్తర అంటాం. ఏ ఉత్తరఫల్గుణి లేక పూర్వఫల్గుణి పూర్ణిమనాడు ఉంటే ఫాల్గుణ మాసం. అందులో ఇప్పుడు మనకి మూడవ నక్షత్రం కృత్తిక, రుద్ర స్వరూపం అది. ఈ నక్షత్రం పూర్ణిమ నాడు ఉండడం వల్ల ఈ మాసమునకు కార్తికం అని పేరు వచ్చింది. ఈ కార్తికమాసం రుద్రాంశతో ఆవిర్భవించినా హరిహరులిద్దరికీ అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. ఇటు శివుడికి ఇటు విష్ణువుకి ఇద్దరికీ చాలా ఇష్టమైన ఏకైక మాసం కార్తిక మాసం. కార్తిక మాసాన్ని సద్వినియోగం చేసుకున్నవారు ఎవరైనా గొప్పవారవుతారు. ఈ కార్తిక మాసంలో మొత్తం మాసమంతా కూడా పూర్వకాలంలో స్నానాలు చేసేవారు, వాటికి కార్తికస్నానాలు అని పేరు. కార్తికస్నానం అంటే ఏమిటి అంటే దీపావళి వెళ్ళిపోయిన మర్నాడు నుంచి మొదలు పెట్టుకొని మళ్ళీ అమావాస్య వరకు ఈ నెల రోజులు సూర్యున్ని చూడకుండా స్నానం చెయ్యాలి అనగా తెల్లవారుజామున స్నానం చెయ్యాలి. కార్తికమాసంలో సూర్యోదయం తరువాత స్నానం చెయ్యటానికి అధమ స్నానం అని పేరు. ఆ స్నానం మంచిది కాదు. ఇప్పుడు కలియుగం అవ్వడం వల్ల మనం పట్టించుకోవడం లేదు కాని అంతకంటే వరాహ స్నానం మంచిదని శాస్త్రం చెపుతుంది. అందుకనే కార్తిక మాసంలో ఎప్పుడూ కూడా మనం సూర్యోదయం కంటే ముందే స్నానం పూర్తి చేసుకొని, సూర్యుడు ఉదయించే సమయానికి అర్చన ముగించేసుకుంటే మంచిదన్నమాట మొదలు పెట్టినా ఫర్వాలేదు. నదులలో కాని, కాలువలలో కాని, చెరువులలో కాని ఇంక ఇవేవి లేకపోతే ఇళ్ల దగ్గర ఉండే బావుల దగ్గర కాని కనీసం స్నానాలగది లో అయినా సరే సూర్యోదయం కన్నా ముందు దంతధావనాదులు, కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చెయ్యాలి. ఆరోగ్యం సహకరించిన వాళ్ళు ఈ నెల రోజులూ కార్తికమాసంలో శిరస్నానం చెయ్యండి. ఈ మాసమంతా నక్తం అనే పేరుతో ఉపవాసం ఉంటే చాలా మంచిది. పూర్వకాలంలో అందరూ ఆరోగ్యవంతులు ఉండేవారు గనుక ఈ మొత్తం



కార్తిక మాసం అంతా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి సాయంత్రం సూర్యుడు అస్తమించాక శివాలయానికి వెళ్ళి లేక విష్ణు ఆలయానికి వెళ్ళి అక్కడ దీపాలు వెలిగించి అది కూడా ఆవు నేతితో వెలిగించి భగవత్ దర్శనం అయ్యాక నక్షత్రాలని చూచి అప్పుడు ఇంటికి వచ్చి భోజనం చేసేవారు. ఇలా ఈ మాసం అంతా నక్షత్ర దర్శనానంతరం రాత్రికి భోజనం చేస్తారు. కనుక దానికి నక్త వ్రతం అని పేరు. కార్తిక నక్త వ్రతం అంటే ఇదన్నమాట. మళ్ళీ కార్తికమాసంలోకూడా సోమవారాలు, ఏకాదశి, పూర్ణిమ, మాస శివరాత్రి, అమావాస్య వీటికి ప్రత్యేకత ఉన్నది. కార్తిక సోమవారాలన్నీ కూడా అత్యంత పవిత్రమైనవి. పూర్తిగా శివానుగ్రహం అందించేవి. కాబట్టి కార్తికమాసంలో సోమవారం నాడు తప్పకుండా (శిర)స్నానం చెయ్యండి. నెలరోజులు (శిర)స్నానం చెయ్యలేనివారు కనీసం కార్తిక సోమవారం నాడైనా (శిర)స్నానం చేసి ఆ రోజు యథాశక్తిగా శివాలయానికి వెళ్ళి శివుడిని అర్చించండి. మన ప్రణవపీఠంలో ఈ నెలరోజులూ తెల్లవారుజామున రుద్రాభిషేకం జరుగుతుంది. గోత్రనామాలు ఇస్తే మీ గోత్రనామాలతో కూడా అర్చన చేసి పెడతాం. ఒకవేళ రాలేనివారు ఉంటారు కదా, వారి గోత్రనామాలతో అర్చన చేయించుకోవచ్చు. ఎంతో లాభం దాని వలన.ఈ నెలరోజులూ చేసుకోలేనివారు కనీసం కార్తికమాసంలో సోమవారం నాడైనా శివాలయానికి వెళ్ళి రుద్రాభిషేకం చేసుకోండి, శివ దర్శనం చేసుకోండి, శివుడ్ని బిల్వపత్రాలతో పూజించండి. కనీసం సోమవారమైనా నక్త వ్రతం చెయ్యండి. ఒక పూట ఉపవాసం చెయ్యటం కనీసం సోమవారమైనా చెయ్యాలి. ఈ కార్తిక మాసంలో తప్పక గురువుల దర్శనం చేసుకొని యథశక్తిగా తాంబూలం ఇచ్చి, దక్షిణ ఇచ్చి గౌరవించాలని శాస్త్రం. కార్తికమాసంలో గురుదర్శనం చెయ్యనివాడు మూర్ఖుడైపోతాడని, మూర్ఖుడు కూడా కార్తికమాసంలో గురు దర్శనం చేసుకుంటే పండితుడౌతాడని శాస్త్రం. పండితో భవతి మూర్ఖః కార్తికమాసంలో గురువుని దర్శనం చేసుకోనివాడు పండితుడు కూడా మూర్ఖుడౌతాడట. అదే కార్తికమాసంలో గురుదర్శనం చేసుకొని గురుకటాక్షం పొందితే మూర్ఖో భవతి పండితః,మూర్ఖుడు కూడా పండితుడవుతాడు. అందుకనే తప్పక ఎక్కడున్నా ఏదో రకంగా గురువు యొక్క దర్శనం చేసుకోవాలి. సాయంత్రం సూర్యుడు అస్తమించాక మళ్ళీ శివ దర్శనం చేసుకొని, భోజనం చేసి కార్తిక సోమవార వ్రతాలు చెయ్యండి. పూర్వం నందివర్ధనుడు అనే ఒక మహారాజు ఉండేవాడు. ఆయన ఈ కార్తికమాసంలో సోమవారంనాడు శివుణ్ణి పూజించాడు. ఆయన కథ చాలా గొప్ప కథ. నందివర్ధనుడు అనే ఒక మహారాజు ఉండేవాడు. ఆ మహారాజు గారికి గురువుగారు ఒకరు ఉండేవారు. నాయనా నువ్వు కార్తికమాసంలోనే కాదు, ఎప్పుడూ సొంతంగా శివుడి పూజ చేసుకో, నువ్వే సొంతంగా చేసుకో అంటే గురువుగారికి మాట ఇచ్చి సూర్యోదయానికి నేను ఏమైనా సరే శివుడి పూజ చేస్తానండి అని మాట ఇచ్చాడు. ఇతని వేశ్యాలోలత్వం, తాగుడు ఉండేది. శివుడ్ని ఎంత భక్తితో పూజించినా ఈ వేశ్యాలోలత్వం మానలేకపోయాడు. వ్యసనాలు అంత తేలికగా వదలలేరు కదా. ఈ రాజు గారు ఒక రోజున నర్తకి దగ్గరికి పోయాడు. ఆ పూట నర్తకి బాగా తాగించేసింది. పైగా సోమవారంతో కూడిన ఏకాదశి కూడా ఆ రోజు, పైగా ఆ రాత్రి తాగుడు మైకంలో ఉండగా తెల్లవారుజామున శివాలయంలో అర్చకులు శివాలయం తెరిచి, మహన్యాసం చదవటం మొదలు పెట్టారు. నర్తకి ఇంట్లో ఉన్న రాజుగారికి మెలుకువ వచ్చింది, చూస్తే నర్తకి ఇంట్లో ఉన్నాడు. సూర్యోదయ సమయానికల్లా శివుణ్ణి ఎలా పూజిస్తాడు?ఈ నర్తకి ఇంటి నుండి ఇంటికి వెళ్ళాలి, స్నానం చెయ్యాలి, ఇంట్లో ఉన్న పూజామందిరంలో పూజ చెయ్యాలి. ఇదంతా అయ్యేసరికి సూర్యుడు ఉదయించడం ఎప్పుడో అయిపోతుంది, మర్నాడు కూడా అయ్యేటట్లుంది. దాంతో ఈయనకి కంగారొచ్చింది. పోనీ నర్తకి ఇంట్లోనే పూజ చేసేద్దామా అంటే నర్తకి ఇంట్లో ఒక్క శివలింగం లేదు. నర్తకి, వేశ్య ఇంట్లో శివలింగాలు ఎందుకుంటాయి?



అక్కడ అన్నీ పువ్వులున్నాయట. ఏదో మొగుడు పెళ్ళాలు విహరించడం కోసం, ఆ వేశ్యతో రాజుగారు విహరంచడం కోసం ఇచ్చిన పువ్వులు, గంధాలు తప్పితే అక్కడ ఏమీ లేవు, మద్యంసీసాలు తప్పితే ఏమీ లేవు అక్కడ. బారులో ఏముంటాయండి, శివలింగాలు ఎందుకు పెడతారు? అలా పెట్టేవారు కూడా ఉన్నారు. ఈ మధ్యన మహానుభావులు లోపల కూడా పెట్టి శివున్ని పూజించి నీకో దండం పెట్టి మేము తాగేస్తున్నాం అన్న వాళ్లు తయారయ్యారట. అది వేరే విషయం కాని, ఆ రోజుల్లో ఆలయాలు వేరుగా ఉండేవి, ఈ మద్యపానం శాలలు వేరుగా ఉండేవి.  అందువల్ల అక్కడ ఎక్కడా ఒక్క శివలింగం లేదు. దానితో ఈయనకి కంగారొచ్చింది, ఏడ్చేసాడాయాన. "అక్కట కన్నుగానక మధాంధుడనై ప్రియురాలి ఇంటిలో చిక్కితి, శైవపూజ ఎట్టుచేయుదు, వేళ అతిక్రమించే ఇందెక్కడ కానరాదు పరమేశ్వర లింగము పోలు రాయో, వేరొక్క పదార్థమో తుదకు యుక్తముయైన ఇంకెట్టులీశ్వరా!" అయ్యో కన్నూ మిన్నూ గానక ఈ ప్రియురాలి ఇంటికి వచ్చి ఇరుక్కుపోయాను. ఇక్కడ మాటవరసకు కూడా అర్చన చేద్దామంటే శివలింగం లాంటి ఒక రాయి కూడా కనపడటంలేదు. పనికిమాలిన వస్తువైనా శివలింగమువలె కనపడితే అభిషేకం చేసి, పూజించి గురువునకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందామంటే ఎక్కడా శివలింగం కనబడటం లేదు ఎలా ఈశ్వరా? అనుకుంటూ ఉండగా వాడికో విచిత్ర దృశ్యం కనపడింది. నిద్రపోతున్న రాజనర్తకి యొక్క వక్షస్థలం మీదున్న ఈ చీర చెంగు పక్కకు తొలిగింది. వక్షోజం బయటకి కనపడింది. ఆ వక్షోజం గుండ్రంగా ఉన్న వక్షోజమే శివలింగంలా కనపడిందట వాడికి. ఇక్కడే ఉన్నాడు శివుడు అనుకొని రాత్రి ఆవిడ తీసుకొచ్చి పెట్టిన పువ్వులుంటాయిగా ఈ మల్లెపువ్వులూ అవీనూ, ఆ వేశ్య తెచ్చిన మల్లెపూలు చేతితో తీసుకొని ఆ వక్షోజాన్నే శివలింగం కింద భావించి ఓం నిధనపతయే నమః, నిధనపతాంతికాయ నమః, ఊర్ధ్వాయ నమః, ఊర్ధ్వలింగాయ నమః, అంటూ పూజ చేసేసాడు. స్నానం లేదు, సంధ్యావందనం లేదు, విభూతి లేదు, మత్తులో ఉన్నవాడు, ఇంకా మత్తు పూర్తిగా దిగనివాడు, వేశ్యా వక్షోజం మీద కార్తిక సోమవారం నాడు పూలు వేస్తే, ఈ పువ్వులు శివుడి పాదాలమీదికి వెళ్ళిపోయాయి. ఆరోజు కైలాసంలో ఈశ్వర దర్శనం కోసం కౌండిన్యుడు, అత్రి, మరీచి, దక్షుడు, అగస్త్యుడు, కపిలుడు, అంగీరుడు, శండిల్యుడు, కృతువు, కణ్వుడు, కుత్సుడు, భృగువు, విశ్వామిత్రుడు, మైత్రేయుడు, మార్కండేయుడు, వాసుడి, వామదేవి, కపి, దుర్వాసుడు, బకుడు, వ్యాఘ్రపాదుడు, మాండవ్యుడు ఇలాంటి మహామునులంతా ఆయన దర్శనానికి వెళ్ళి పువ్వులు ఆయన పాదాల మీద వేస్తే ఆ పాదాల మీదికి పువ్వులు వెళ్ళటంలేదట. ఎందుకంటే వాళ్ళ దగ్గర శక్తి ఉంది కాని అంత భక్తి లేదు. కానీ భూలోకంలో వేశ్యావక్షోజం శివలింగం కింద భావించి రాజుగారు వేసిన పువ్వులు ఆయనకి చేరాయి. అప్పుడు పార్వతి ఇదేం పూజండి అని అంటే వెర్రిదానా వాడికున్న ఆవేదన, ఆ భక్తి ఇక్కడున్న ఇంత మందిలో లేదు. కాబట్టే చిత్తశుద్ధి ఉంటే వాడి శరీరం శుద్ధి లేకపోయినా ఫర్వాలేదన్నాడు. చూసారా ఈశ్వరుడు ఎంత కరుణా స్వరూపుడో.

## ఏకాదశి

ఏకాదశి అనే మాటవింటే యమకింకరులు వణికిపోతారు. అందులో కార్తికమాసంలో వచ్చే రెండు ఏకాదశులలోనూ సూర్యోదయానికి ముందు లేచి కాలవలలోగాని, గంగలోగాని, నదులలో గాని ఎక్కడైనా సంకల్ప సహిత స్నానం చేసి ఆ తరువాత విష్ణవాలయం లేక శివాలయాలకు వెళ్ళి యథాశక్తిగా అర్చన చెయ్యాలి. తులసీదళాలతో హరిని, బిల్వపత్రాలతో హరుని అర్చన చేసి ఈ రోజు ఉపవాసముండి, రాత్రికి నక్త భోజనం కాని లేదా సంపూర్ణ ఉపవాసం కాని చేసి, భగవంతుని కథలు వింటూ, భగవత్ ధ్యానం చేసినటువంటివాడు జీవితంలో యమకింకర దర్శనం చెయ్యడు, నరకానికి వెళ్ళడు,సకల శుభాలూ పొందుతాడు. ఏకాదశినాడు ఒకవెయ్యాఎనిమిది తులసిదళాలతో గాని బిల్వపత్రాలతో గాని శివున్ని పూజించినవాడు ఐశ్వర్యాన్ని పొందుతాడు. చామంతి పువ్వులూ, తులసీదళాలతో విష్ణువుని



పూజించినవాడు మంచి పదవి పొందుతాడు. ఏకాదశినాడు జాగరణ చేసి భగవత్ కథలు వింటూ తెల్లవారుఝామున మళ్ళీ స్నానం చేసి హరి దర్శనం చేసుకున్నటువంటివాడికి జీవితంలో ఎప్పుడూ దుఃఖం రాదు. అసలు వాడికి ఎప్పుడూ సుఖం, శాంతి, ఆనందం తప్ప మాటవరుసకికూడా దౌర్భాగ్యమూ, దుఃఖమూ ఉండవు.

## కార్తిక పూర్ణిమ

కార్తిక పూర్ణిమ వైశిష్ట్యం:ఈరోజు దీపోత్సవం చెయ్యాలి శివుడి సన్నిధానములో లేక విష్ణువు సన్నిధానములో.

కార్తిక పూర్ణిమ నాడు లక్ష పత్రి పూజ తప్పక చెయ్యాలి.ప్రతి సంవత్సరం కార్తిక పూర్ణిమ వచ్చిందంటే లక్ష పత్రి పూజ చేయవలసిందే. లక్ష పత్రి తీసుకొచ్చి (బిల్వ దళాలు) వాటితో రుద్రున్ని పూజించాలి.లక్షదళాలు తగ్గకూడదు,ఎక్కువ ఉన్నా దోషము కాదు.లక్ష పత్రితో పూజ చేసి, పగలు యధాశక్తిగా ఉపవాసం వుండి, మహన్యాస పూర్వకంగా అభిషేకాదులు చేసి రాత్రి కూడా ఈ పూజ చేస్తారు. ఇది కాకుండా కార్తిక పూర్ణిమ నాడు కోటిదీపోత్సవం చెయ్యాలి. ఆవునెయ్యిలో ముంచబడినటువంటి కోటి వత్తులు వెలిగించటము. శివాలయములో దీపం వెలిగించినవాడు సాక్షాత్తు కుబేరుడైపోతాడు. కుబేరుడి కథ అందరికీ తెలిసినదే.గుణనిధి అని పేరు కలిగిన ఒకానొక దౌర్భాగ్యుడుండేవాడు. అంతటి పాపాత్ముడు మరొకరు లేరు. వాడు చిన్నప్పటి నుంచి వేశ్యాలోలత్వం, మద్యపానం, జూదం ఇవన్నీ ఆడేవాడు ,వ్యసనాలతో తిరిగేవాడు. చివరికి వాడి పాపం పండింది, తండ్రి వాడిని ఇంట్లోంచి గెంటేసాడు. వాడు దిక్కూమొక్కూ లేక ఏడుస్తూ తిండిలేక అలమటిస్తూ కాశీకి పోయాడు. కాశీకి పోతూ దారిలో ఏడుస్తాడు. కవి సార్వభౌముడు శ్రీనాథుడు.సూర్యుడు తూర్పు దిక్కున ఉదయించే సరికల్లా మా అమ్మ నాకోసం బంగారపు గిన్నెనిండా పెరుగు అన్నం పట్టుకొచ్చేది. ఊరగాయ నంచి ఇంత అన్నం పెట్టి నన్ను బయటికి పంపేది. మా అమ్మ అన్నం తిని వేదం చదువుకొమ్మంటే జూదమాడి సర్వభ్రష్టుడినైపోయాను. అమ్మకి దూరమైపోయాను. ఇంక నాకు ఇంత అన్నం పెట్టేవాడెవడు? కడుపు మాడిపోతూవుంటే పిలిచి అన్నం ముద్ద పెట్టేవాడు లేడు. హర! హర! ఇంక నాకు ఎవరు పెడతారు అన్నం? అని పాపం ఏడిచాడు. ఇప్పుడు వెనక్కి వెళ్ళలేడు కదా! చేసిన పాపాల వల్ల చివరికి కాశీకి పోయాడు. అక్కడ శివరాత్రినాడు పంచక్రోశులకు దూరంగా దొంగాడు అని ఎవరో అనడంతోటి కాపలావాళ్ళు బాణం కొడితే చనిపోయాడు. శివుడి సన్నిధానంలో శివరాత్రినాడు దీపం వెలిగించి తదనంతరం అక్కడే చచ్చాడు. ఇప్పుడు చచ్చినవీడు శివుడి సన్నిధానంలో శివరాత్రినాడు దీపం వెలిగించిన పుణ్యమువల్ల కైలాసానికి వెళ్ళి అక్కడ సుఖాలనుభవించి భూలోకంలో కళింగదేశపు రాజుగారికి ఐందవుడనే వాడికి దముడనే పేరుతో కొడుకుగా పుట్టాడు. శివరాత్రినాడు కాశీ దగ్గర శివాలయములో దీపం వెలిగించిన పుణ్యమువల్ల రాజుగారి కొడుకై పుట్టాడు. కళింగము అంటే ఇప్పుడు ఒడిసా .ఒడిసా రాజుగారి కొడుకుగా పుట్టాడు. అదేవాడు కాశీలో ఐదుక్రోశుల లోపల చనిపోతే పునర్జన్మ వచ్చివుండేది కాదు. వాడికాయోగంలేదు. అందుకే ఆ పంచక్రోశములకు అవతల చనిపోయాడు, రాజు కొడుకై పుట్టాడు. వాడికి పూర్వజన్మ గుర్తున్నది. నేను పూర్వకాలంలో శివాలయంలో దీపము వెలిగించిన పుణ్యము వల్ల కదా రాజుగా పుట్టాను అనుకున్నాడు. శాస్త్రాలన్నీ చదువుకున్నాడు.అందువల్ల వీడు రాజవగానే కార్తికమాసంలో, నా రాజ్యంలో, శివాలయంలో అఖండంగా దీపాలు వెలిగించాలి. కార్తికమాసమంతా వంతులు వేసుకొని నా ప్రజలు శివాలయంలో దీపాలు వెలిగించకపోతే మరీ ముఖ్యంగా సోమవారాలు, ఏకాదశి, పూర్ణిమలలో దీపాలు వెలిగించకపోతే శిరశ్ఛేధన శిక్ష అన్నాడు. రాజాజ్ఞ కదా! చట్టానికి భయపడి అందరూ దీపాలు వెలిగించారు. ఈయన కూడా దీపాలు వెలిగించాడు కార్తిక పూర్ణిమనాడు శివాలయంలో కోటి దీపాలు వెలిగించాడు. ప్రజల చేత ఆవునేతితో దీపాలు వెలిగించిన పుణ్యమువల్ల, స్వయంగా తానూ దీపాలు



వెలిగించటంవల్ల, కార్తిక పూర్ణిమనాడు శివాలయంలో కోటి దీపాలు వెలిగించటంవల్ల ఆ మహాపుణ్యంతో తరువాతి జన్మలో పులస్త్య ప్రజాపతి కొడుకైన విశ్రవసునికీ ఇళబిళ దంపతులకు కొడుకై పుట్టాడు. ఆయనే కుబేరుడు ఇదంతా కార్తిక దీప మహాత్మ్యము. ఒక సామాన్యున్ని ఒక పాపాత్ముడిని రాజుని చేసింది శివాలయంలో దీపం. ఆ పాపాత్ముడు రాజైన తరువాత మళ్ళీ కుబేరుడయ్యాడు. కాబట్టి కార్తిక మాసమంతా ఆవునేతితో దీపాలు శివాలయంలో వెలిగించాలి. మరీ ముఖ్యంగా కార్తిక పూర్ణిమనాడు తప్పక ఈశ్వరుడి సన్నిధానంలో దీపోత్సవం చెయ్యాలి. అద్భుతమైనటువంటి పదవిని పొందడానికి దారిద్ర్యం తొలగించడానికి కార్తిక పూర్ణిమ గొప్పగా ఉపయోగపడుతుంది. ఇక మరొకటి కార్తిక పూర్ణిమనాడు జ్వాలాతోరణం శివాలయానికి ఎదురుగుండా చక్కని రెండు స్తంభాలు (వంకరలు బొడిపలు లేని కర్రలు)పాతుతారు. గడ్డితోటి వెంటి (తాడు)ని పేనుతారు. ఈ వెంటిని కర్రలకు కడతారు.మంత్ర పూర్వకంగా వెంటిని కాగడాలతో వెలిగిస్తారు.భగభగలాడుతూ మండుతూ ఉంటేఆ మంటల క్రింద నుంచి శివపార్వతుల ఉత్సవ మూర్తులను పుచ్చుకొని దూరాలి. ఆ మూర్తుల వెనుక అక్కడ ఉన్న ప్రజలు అందరు దూరుతారు .దానిని జ్వాలాతోరణం దూరుట అంటారు. అలా మూడుసార్లు చేస్తారు.ఆ తరువాత శివుడి సన్నిధానంలో ఈ ఉత్సవ మూర్తులు వుంచి శివనామ స్మరణ చేస్తూ శివుడి దర్శనం చేసుకుంటే వారికి వున్న దారిద్ర్యమంతా తొలగిపోతుంది. మహాపాపాలు పటాపంచలైపోతాయి. గడ్డి మేటు ఎలా అయితే చురచురా కాలి బూడిదై పోతుందో మానవుడు చేసిన మహాపాపములన్నీ ఈ జ్వాలాతోరణం దూరితే పటాపంచలైపోతాయి, కాలి బూడిదై పోతాయి. కాబట్టి కార్తిక పూర్ణిమనాడు జ్వాలాతోరణ మహోత్సవం కూడా జరుపుకోవాలి,కాలగా మిగిలిన గడ్డి పరకలను పశువులకు తినిపిస్తారు. పశుసంపద పెరుగుతుదని నమ్మకము.

ఇక కార్తిక మాసంలో చిట్టచివరికి పోలిస్వర్గం. అమావాస్య అయిన మరునాడు ఈ కార్యక్రమాన్ని కూడా భక్తులందరూ కూడా చేసుకోవాలి. ఇందులో ఏ కార్యక్రమం చేస్తే ఏ లాభమో అన్నీ కార్తిక పురాణంలో వున్నాయి. కార్తిక మాసంలో స్నానాలు చెయ్యండి, సూర్యోదయానికి ముందు చేసేవి కార్తీక స్నానాలు.ముఖ్యంగా కాలవలలో, నదుల్లో ప్రవాహ జలంలో చేస్తే మంచిది. కార్తిక మాసంలో నెల్లాళ్ళుగాని, సోమవారాలు గాని, ఏకాదశులలో గాని రాత్రిపూట మాత్రమే భోజనం. ఒంటి పూట భోజనం చేస్తే నక్తవ్రతం అని పేరు. ఈ కాలంలో గురువు దర్శనం చేసుకోండి. గురువు యొక్క అనుగ్రహం పొందండి. అక్షతలు వేయించుకోండి. వీలున్నంత వరకూ మీ కుల గురువులకో, మీ కుల పురోహితులకో, గుళ్ళల్లోని అర్చకులకో స్వయంపాక దానం చేసుకోండి. అంటే భోజనం చెయ్యటానికి పనికొచ్చేవి దక్షిణతో పాటుగా దానం చెయ్యండి. బియ్యం, పప్పులు, ఉప్పులు, కూరగాయలూ వీటన్నింటితో పాటుగా దక్షిణ. స్వయంపాక దానం చాలా గొప్పది. ఈకాలంలో గురువులకు చుట్టూ ప్రదక్షిణ చెయ్యాలి శివాలయంలో ప్రదక్షిణ చెయ్యాలి. దీపములు వెలిగించాలి. అందునా ఆవునేతి దీపం మరింత మంచిది. ఆవునేతితో ఈకార్తిక మాసంలో వెలిగించిన దీపములు అపూర్వమైన జ్ఞానాన్ని ఇస్తాయి. పాపాలు తొలగిస్తాయి. పదవులిస్తాయి రాత్రి, పగలూ కూడా మీ సంప్రదాయాన్ని బట్టి విభూతి ధారణ ఊర్ధ్వ పుండ్రధారణ, కుంకుమ ధరించండి. ఏమైనా దొరక్క దొరికే కార్తిక మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భగవత్ అనుగ్రహం పొందాలి. కార్తికమాస ఉత్సవాలన్నీ మన ప్రణవ పీఠంలో గురువుల ఆధ్వర్యవంలో నిర్వహించబడతాయి. అవకాశము ఉన్నవారందరమూ సద్వినియోగము చేసుకుందాము.

హరిః ఓం తత్సత్

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



## కార్తిక మాసంలో దీపం ఎందుకు వెలిగించాలి?

ఓం నమశ్శివాయైచ నమశ్శివాయ. దీపం గురించి సౌర పురాణంలో ఒక గొప్ప మాట ఉన్నది. దీపం వెలిగించేటప్పుడు క్రింద ఒక ప్రమిద పెడతారు. ఈ ప్రమిద మన శరీరం. మృణ్మయ శరీరం. అందుకే సాధారణంగా ప్రమిదలన్నీ మట్టితో తయారు చేసి కాల్చి అక్కడ పెడతారు. ఈ మృణ్మయ శరీరమే అనగా, మట్టితో తయారు చేయబడిన శరీరమే ఆ ప్రమిద. ఈ ప్రమిదలో ఆజ్యం ధర్మం, ఆజ్యం అంటే నెయ్యి. ప్రమిదలో పోసే నెయ్యి ధర్మం అని అర్థం. లోకంలో శరీరం నిలబడాలంటే ముందు ధర్మం ఉండాలి. అయితే ఈ ధర్మాన్ని పోషించేది సత్యం. అదే మీరు ప్రమిదలో వేస్తున్న వత్తి. సంస్కృతంలో దీనిని వర్తి అంటాం. తెలుగులో వత్తి అయ్యింది. దీనిని జ్ఞానం అనేటువంటి అగ్నితో వెలిగిస్తే "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణాం తమాహు పండితం బుధాః" అని స్వయంగా భగవద్గీతాచార్యుడు శ్రీకృష్ణుడు అన్నాడు. ఈ అగ్ని వెలిగించగానే సత్యం అనే ఆ వత్తి వెలుగుతుంది. ఈ వత్తి వెలగడానికి ఇంధనం నెయ్యి, అది ధర్మం. దానితో మట్టితో తయారు చేయబడిన శరీరం, ఈ మృణ్మయ శరీరం శాశ్వతంగా పవిత్రం అవుతుంది. మళ్ళీ ఇలాంటి జన్మలెత్తినా నానా కర్మలు చెయ్యవలసిన అవసరం లేని ఒకానొక ఉచ్ఛ స్థితికి తీసుకు వెళ్ళే ఒక అపూర్వమైన వస్తువు ఈ దీపారాధన అని చెప్పవచ్చు. దీపారాధన ఏ మాసంలో అయినా వెలిగించవచ్చు. ఇక కార్తిక మాసంలో "మాసానామ్ నియమో నాఽత్రానా జనానాం నియమోపినా" అని స్కాంద పురాణంలో ఈ దీప మహాత్యం గురించి చెప్పారు. ఫలానా మాసం, ఫలానా నెల అని లేదు. కాని కార్తిక మాసానికి మాత్రం ఒక ప్రత్యేకత ఉంది. దానికి గల కారణం గురించి, ఎంతసేపు లౌకికమైన చిన్నాచితకా కథలు చెప్పుకున్నా, అసలు మూల కారణం మాత్రం పృథు చక్రవర్తి కూడా అని చెప్పాలి. అతని తండ్రి అయిన వేనుడి వల్ల ఎప్పుడో కృతయుగంలో ఈ దీపారాధన చేయటం మొదలైంది. పూర్వం పవిత్రమైన సూర్య వంశంలో వేనుడు అనే ఒక రాజు ఉండేవాడు. వాళ్ళ అమ్మ యమధర్మరాజు గారికి, అనగా మృత్యు దేవతకి స్వయానా చెల్లెలు. ఆ దోషం వల్లనో ఏమిటో ఈ వేనుడు అనే వాడు వట్టి నాస్తికుడుగా తయారయ్యాడు. ఇరవై నాలుగు గంటలు నాస్తిక వాదం, గందరగోళం ప్రచారం చేసే ఒకానొక దరిద్రపు లక్షణం వాడికి పట్టుకున్నది. వాడికి ఇలా దీపోత్సవాలు అన్నా, కార్తిక మాసం అన్నా కూడా అసహ్యం. ఏమైనా అంటే నేనే దేవుడిని, నేనే సాధిస్తాను అని అనేవాడు. కొంత మంది పెద్దలు, సజ్జనులు దీపాలు వెలిగిస్తూ ఉన్నా, యజ్ఞం చేస్తూ ఉన్నా కూడా వాడికి కోపం వచ్చేది. దానిని

కం. దివ్యులు వెఱఁగందఁగఁ బృ
    థ్వీవ్యోమముల గల భేరి వ్రేయించె "న య
    ష్టవ్య మదాతవ్యమహో
    తవ్యం విప్రా" యనుచు నుదాత్తధ్వనులన్

అని పోతన గారు చాలా అద్భుతంగా కంద పద్యం లో చెప్పారు. 'ఈ రోజు నుంచి నా రాజ్యంలో ఎవ్వరూ యజ్ఞం చెయ్యడానికి వీలు లేదు. యజ్ఞంలో నెయ్యి పొయ్యడానికి వీలు లేదు. 'అదాతవ్యం' అనగా అసలు దానం చేయడానికి వీలు లేదు. ఈ దానం పుచ్చుకునే వాళ్ళు, యజ్ఞాలు చేయించే వాళ్ళు పాపాత్ములు. నేనే పరమాత్ముడిని, నేనే దేవుడిని. అసలు మనిషి కంటే గొప్పవాడు లేడు' అని అనేవాడు. యజ్ఞాలు లేక పోవడం వల్ల లోకాల్లో వర్షాలు లేవు. వర్షాలు లేక పోతే పంటలు లేవు. పంటలు లేకపోతే క్షేమం పోయి క్షామం మిగిలింది. దానితో పాపం ఋషులందరూ కూడగట్టుకున్నారు. అందులో దేవతలు, వశిష్ఠుడు లాంటి మహానుభావులు అయిన ఋషులు అంతా కూడా ఒక రోజు వేనుడి దగ్గరకు వచ్చి, "మహారాజా! వేద కాలం నుంచి వస్తున్న సంప్రదాయం ఇది. యజ్ఞాలు చేసి తీరాలి. యజ్ఞం చేస్తే ఇంద్రుడు సంతోషిస్తాడు.

ఆ. మఖము సేయ వజ్రి మది సంతసించును
వజ్రి సంతసింప వాన గురియు
వాన గురియఁ గసవు
వసుమతిఁ బెరుగును
గసవు మేసి ధేనుగణము బ్రతుకు.

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక




అనగా యజ్ఞం చేస్తే ఇంద్రుడు సంతోషిస్తాడు. ఇంద్రుడు సంతోషిస్తే సకాలంలో వర్షాలు కురిపిస్తాడు. వర్షాలు కురిస్తే పంటలు హాయిగా పండుతాయి. ఈ పంటలు మనం తింటాం. గడ్డిని గోవులకు వేస్తాం. మళ్ళీ గోవులు పాలు ఇస్తాయి. పాలు కాసి తోడు పెడితే పెరుగు అవుతుంది. అందులోంచి వచ్చేటటువంటి వెన్న, నెయ్యి, పెరుగు మొదలైనవి మనం తీసుకుంటాం. కొంత వెన్న, నెయ్యి, మనం వాడుకుంటాం. మరికొంత నెయ్యి దేవతలకి యజ్ఞ రూపంలో అందిస్తాం. వేద మంత్రములతో మనం వేసే నేతిని, అనగా హవిస్సుని మళ్ళీ దేవతలు స్వీకరించి వర్షం కురిపిస్తారు. కాబట్టి యజ్ఞం చేసి తీరా" అని అన్నారు. వీడు మూర్ఖుడు కదా! యజ్ఞం చెయ్యడానికి ఎక్కడో కనపడని దేవుడు ఎందుకూ, ఎదురుగా కనపడేదే నిజం. అన్నింటికీ ప్రత్యక్ష ప్రమాణం ఉండాలి. ఈ రోజు నుంచి యజ్ఞాలు చెయ్యకండి. మీరు దేవుడికి నివేదన చెయ్యాలనుకుంటే ఆ పండో లేకపోతే నెయ్యో నాకు ఇచ్చేయండి. ఎవరికైనా దానం చెయ్యాలనుకుంటే నాకే చేసేయండి. శివుడి మీద కాసేపు ఉండే అభిషేకం కోసం వాడుతున్నారే, ఈ నెయ్యి మొదలైనవి నాకు ఇచ్చేయండి. కనీసం ఈ జనం తింటారు. కనపడని దేవుడు ఎందుకూ " అని అన్నాడు. ఋషులు, దేవతలు కూడా అతడికి ఎంతో చెప్పి చూసారు. వాడు మూర్ఖుడు కదా! వినడు. చివరకు వీళ్ళకి కూడా ఆగ్రహం కలిగింది. అంతే, ఆవేశంతో ఋషులు వేనుడిని 'ఈ క్షణమే మరణించు' అని అన్నారు. మహాత్ములకి కోపం వస్తే శాపం పెడతారు. వారు కూడా సామాన్యంగా ఎప్పుడో గాని పెట్టరు. కాని ఇప్పుడు పెట్టారు. అలా పెట్టడం తోటి ఆ క్షణమే చచ్చిపోయాడు వేనుడు. వాడు చచ్చిపోగానే లోకం మళ్ళీ అల్లకల్లోలం అయిపోయింది. అయితే లోకంలో కనీసం ఈ మాత్రం ప్రభువు కూడా దిక్కు లేడని తెలిసివచ్చింది. అప్పుడు చివరికి దేవతలు, ఋషులు అందరూ వచ్చి వేనుడి శరీరాన్ని చిలికారు. అదిగో అలా చిలికినప్పుడు ఆ శరీరం నుంచే రకరకాల వస్తువులు పుట్టుకొచ్చాయి. అప్పుడు ఆయన కుడి తొడ నుంచి మహానుభావుడు పృథు చక్రవర్తి పుట్టుకొచ్చాడు. అతడు వేనుడి కొడుకు కాబట్టి పృథువును 'వైన్యుడు' అని అన్నారు. ఆయన పుట్టిన వెంటనే, ఇప్పటిదాకా వాళ్ళ నాన్న చేసిన పాపం వల్ల భూలోకంలో ఎక్కడా పంటలు లేవు. మొత్తం సర్వనాశనం అయిపోయింది. అయితే భూదేవికి కొన్ని వేద కార్యక్రమాలు జరగకపోతే వేదన కలిగి, అన్నీ తన లోపల దాచేసుకుంటుంది. అయితే అప్పుడు ఏమౌతుంది? భూమిపై విత్తనాలు మొలకెత్తవు. నేలంతా చవిటి భూమి అయిపోతుంది. ఎక్కడా సారవంతమైన భూమి ఉండదు. ఎవరన్నా మనుషులు ఇల్లు కట్టుకుంటే భూకంపాలు వచ్చి ఇళ్ళు కూలిపోతాయి. అయితే అప్పటికే సర్వనాశనం అయిపోయింది. భూదేవి నుంచి ఎటువంటి సారం లేదు. పంటలు లేవు, తిండి లేదు. అప్పుడు ఏం చెయ్యాలి? అని పృథు చక్రవర్తి సంకల్పించాడు. అప్పుడు లక్ష్మీ దేవి ఆయన దగ్గరకు వచ్చింది. "కార్తిక మాసంలో నెల రోజులు ప్రతి శివాలయంలో, విష్ణువు ఆలయంలో, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉన్న ప్రదేశాల్లో, గంగానది వంటి నదీ తీరాలలో ఈ నెల రోజులపాటు దీపారాధన వెలిగిస్తే ఆ దీపాలు ఉన్న చోట నేను వచ్చి చేరతాను. నేను వచ్చానంటే నాతో పాటు అష్ట విధాలైన లక్ష్మీ మూర్తులు కూడా వస్తాయి. అందులో ఒకటి వర్షం, మరొకటి శాంతి, మరొకటి సౌఖ్యం, మరొకటి పంట ఇలా వరుసగా ఎనిమిది రకాలైన విశేషాలు మానవుడికి అందుతాయి. కాబట్టి దీపాలు వెలిగించు నాయనా పృథు చక్రవర్తీ!" అని అన్నది. అప్పుడు పృథు చక్రవర్తి తన రాజ్యంలోని ప్రజలతో, 'మీరందరూ కార్తిక మాసంలో దీపాలు వెలిగించండి' అని అన్నాడు. అయితే మంచిమాటను ఎవరైనా అంత తేలికగా వింటారా! అదీగాక అంతకు పూర్వం పరిపాలించిన రాజుగారి ప్రభావం కూడా కొంత ఉంటుంది కదా! 'అసలు ఆ దీపాలు వెలిగిస్తే లాభం ఏమిటి? అసలే కరువుతో ఉన్నాం. ఉన్న నెయ్యి కాస్త అన్నంలో తింటే లాభం కదా!' అని వారు అన్నారట. అయితే పృథువు తన ప్రజలతో కాస్త కఠినంగానే, 'ఈ క్షణం నుంచి చెపుతున్నాను. నా రాజ్యంలో కార్తిక మాసం నెల రోజులపాటు దీపాలు



వెలిగించని వాళ్లని దొంగని వధించినట్టు వధిస్తాను' అని అన్నాడు. అప్పుడు రాజుగారి భయంతో అందరూ కార్తిక దీపాలు వెలిగించారు. అలా వెలిగించడం తోటే భూమి మళ్ళీ సస్యశ్యామలం అయ్యింది. క్రమంగా అన్ని రకాల సంపదలు సమకూరి వచ్చాయి. అదిగో అప్పటి నుంచి కార్తిక మాసంలో దీపాలు వెలిగించడం మొదలుపెట్టారు. ఆ విధంగా దీపాలు వెలిగించడం మొదలు పెట్టినప్పటి నుంచి, మళ్ళీ భూమండలం అంతా అన్ని రకాల సంపదలతో తులతూగింది. కాబట్టి ఆ పృథు చక్రవర్తి ఆజ్ఞకు బద్ధులమై అప్పటి నుంచి ఈ కార్తిక మాసంలో మనం దీపాలు వెలిగించుకుంటున్నాం. మహాభారతంలోని అనుశాసనిక పర్వంలో కూడా దీపారాధన గురించిన ఒక అద్భుతమైన కథ ఉన్నది. ఒకసారి సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మీ దేవి దీపావళి అమావాస్య నాడు భూమండలానికి ప్రదక్షిణకు వచ్చింది. ఏ ఇంటికి వెళదాము అని అనుకుందట. లక్ష్మీ దేవి ఒక ఇంటిలోకి వెళ్ళాలంటే ఆ ఇల్లు కాస్త కళకళ లాడుతూ ఉండాలి. చింపిరి జుట్టు వేసుకొని, స్నానం చెయ్యకుండా, అపవిత్రంగా ఉంటూ, దీపాలు వెలిగించని ఇంట్లోకి లక్ష్మీదేవి రమ్మంటే కూడా రాదు. అయితే మీరంతా ఎంతో అదృష్టవంతులు. మీ చేత ఇలాంటి పవిత్ర కార్యక్రమం ఎందుకు చేయిస్తున్నారంటే, ఇలా దీపం వెలిగించి మీ ఇంటికి వెళితే వద్దంటే కూడా డబ్బు వస్తుంది. అందుచేత లక్ష్మీదేవి మొత్తం భూమండలం అంతా ఒకప్పుడు అమావాస్య నాడు వెతికింది. ఆమెకు ఏ ఇల్లు నచ్చలేదు. చివరికి వెతికితే వెతికితే, ఊరు అవతల ఒక గోశాల ఉంది. ఆ గోశాల దగ్గరికి వెళ్లిందట. లోపల రకరకాల ఆవులు ఉన్నాయి. ఆ ఆవులను చూచి ముచ్చట పడి, ఆహా ఎంత పవిత్రంగా ఉన్నాయి ఆవులు అనుకుంది. ఇక్కడ ఉండి పోదాం అని లక్ష్మీదేవి లోపలికి అడుగు పెడుతూ ఉంటే టక్కున గోవులు, "కాసి త్వం కల్యాణి?" అనగా 'ఓ శుభ ప్రదమైన దానా! నీవు ఎవ్వరివి?' అని అడిగాయి. లక్ష్మీదేవి వాటితో, 'నన్ను మీరు ఎరుగరా!' అని అన్నది. లక్ష్మీ దేవిని ఎరుగని వాళ్ళు ఎవరున్నారు? కాని పాపం ఆ గోవులకి తెలియదులెండి. అందుకని 'నీవు ఎవరివి?' అని మళ్ళీ అడిగాయి. నేను సాక్షాత్తు విష్ణువు పత్నిని లక్ష్మిని అందావిడ. 'అయితే మేము ఉంటున్న చోటుకి రావద్దు. బయటకు వెళ్లిపో' అని అన్నాయి గోవులు. లక్ష్మీ దేవి చిన్నబోయింది. (మీలో ఎవరైనా మీ ఇంటికి లక్ష్మీదేవి ఇప్పుడు వస్తానంటే మా ఇంటికి రావద్దమ్మ లక్ష్మీ అనే వాళ్ళు ఉన్నారా!) కాని గోవులు వద్దు అన్నాయి. దాంతో ఈవిడ కంగారుపడి, 'అదేమిటి మహాలక్ష్మిని నన్ను రావద్దంటే ఎలాగా? రేపటి నుంచి నాకు పరువు ఉండదు' అని అన్నది. అందుకు గోవులు, 'లేదమ్మా! నీకు నిలకడ లేదు."లక్ష్మీః చంచలా" అనగా 'లక్ష్మీ అంటే చంచలంగా ఉంటుంది' అని అర్థం. ఆమె ఒక క్షణం ఉంటుంది, ఒక క్షణం ఉండదు. ఇవాళ వాడు కోటీశ్వరుడు. రేపు వాడే పేదవాడు అవుతాడు. పేదవాడు కోటీశ్వరుడు అవుతాడు. కనుక 'నీవు క్షణ క్షణానికి మారిపోతావు. ఎక్కడా నిలకడగా ఉండని నీలాంటి వాళ్ళని మా దగ్గరకు రానివ్వం అని గోవులు అన్నాయి. అలా అనగానే అపుడు పాపం లక్ష్మీదేవి చిన్నబోయిన ముఖంతో, 'మీరు ఏదో రకంగా రానివ్వక పోతే నాకు విలువ ఉండదు అని అన్నది. గోవులు కూడా లక్ష్మిని గట్టిగానే బతిమాలాయి. అప్పుడు గోవులు లక్ష్మీదేవితో, 'అయితే ఈ క్షణం నుంచి చెపుతున్నాము. కార్తిక మాసం నెల రోజులు ఆవు నేతితో ఎక్కడ దీపారాధన జరిగితే అక్కడ ఉండండి. వెలిగించే వాళ్ళ ఇళ్ళలో ఉండండి' అని అన్నవి. అందుకని అప్పటి నుంచి కార్తిక మాసం నెల రోజులు ఆవు నేతితో దీపం వెలిగించడం మొదలు పెట్టారు. ఆవిధంగా ఇప్పుడు లక్ష్మీదేవి కార్తిక మాసం నెల రోజులు దీపారాధన చేసేటటువంటి వాళ్ళ ఇళ్ళలో ఉంటానన్నది. కనుక మీరు దీపారాధన చేస్తే మీ గృహాలలో లక్ష్మీదేవి సమృద్ధిగా ఉంటుంది. శాంతిగానూ, సంతోషం గాను ఉంటుంది. కాబట్టి ఇటు ఈశ్వరుడికి ప్రీతిగా, అటు లక్ష్మీ ప్రీతిగా మీరు దీపారాధన నెల రోజులు చెయ్యండి. "హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజత స్రజాం" అని అన్నారు. బంగారు రంగులో ఉంటుంది లక్ష్మి. కావున ఆ జగన్మాతకి, మరొక ప్రక్క

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



ఈశ్వరుడికి అన్ని క్షేత్రాలలో, దేవదేవుల సన్నిధిలో కూడా ఈ దీపం వెలిగిస్తే అనేక శాంతులతో కూడిన లక్ష్మీ కటాక్షం లభిస్తుంది



### కార్తిక మాసం లో వనభోజనాలు చేయాలి అంటారు ఎందుకు?

కార్తిక మాసంలో తోటలలో ప్రకృతి చాల బాగుంటుంది .ఆ సమయం లో ఆరోగ్యం కలగచేసే కొన్ని సూక్ష్మక్రిములు తోట లో తిరుగుతుంటాయి .తోట లో ఉన్న గాలి కూడా ఈ కాలం లో ఆరోగ్య కరమైన గాలి .ఈ ఒక్క రోజు అందరు కులాలు మతాలు సంఘాలు అనే భేధభావం విడిచి పెట్టి చక్కగా పూజలు చేసుకుని పంక్తి భోజనం చేసే వారు.అందరి లోను ఉన్న జీవాత్మ పరమాత్మయే ,మీరు అందరు ఐకమత్యం తో ఒకరిని ఒకరు అర్థం చేసుకుని ఉన్నారు, కనుక మీ అందరిలో నేను ఉండి అనుగ్రహిస్తాను అన్నాడు. భగవంతుడు .శ్రీ కృష్ణ పరమాత్మ భగవద్గీత లో ఏమి చెప్పారు అంటే "ప్రతి ప్రాణిలోనూ ఆఖరికి కుక్కలోను , కుక్క మాంసం తినేవాడిలోనూ కూడా పరమాత్మని చూడ గలిగే వాడే పండితుడు".కోటీశ్వరుడు ,సామాన్యుడు, పండితుడు పామరుఁడు అన్న భేధభావం లేకుండా అందరు కలిసి భోజనం చేయటం ద్వారా అందరిలో ఉన్న పరమాత్మని గౌరవిస్తారు ,ఈ జీవ ఐకమత్యం అంటే ప్రాణులు ఒకరిని ఒకరు గౌరవించు కోవటం ద్వారా ఈశ్వరుడి పూజ చేసినట్టే .రాగద్వేషముకి తావు లేకుండా భగవంతుడ్ని అన్ని ప్రాణులలో చూసే తంతే వనభోజనం .కాబట్టి పవిత్రమైన కార్తిక మాసం లో ప్రతి వృక్షం లో ఉన్న దేవతను ,ప్రాణులలో ఉన్న దేవతలని పూజించుకుంటూ అందరు ఐకమత్యం తో భోజనం చేస్తే అప్పుడు ఈశ్వరుడు ,కేశవుడు సంతోషిస్తారు దాని ద్వారా మనకి ఉత్తమ గతులు సంపదలు కలుగు తాయి ,ఊరు కూడా ఐకమత్యం తో ఉంటుంది .ఎప్పుడు ఎవరి ఇంటిలో వారు భోజనం చేస్తూ ఇతరులను పట్టించుకోక పోతే ఐకమత్యం ఉండదు .వనభోజనంలో బిర్యానీ పలావు తినడం చేయకూడదు అలా చేయటం మహా పాపం వృక్ష దేవతల శాపానికి గురి అవుతాము .అందువల్ల పులిహార ,పాయసం వంటి సాంప్రదాయ వంటకాలే ఉండాలి మాంసం మద్యం వంటివి మహాపాపం అలా సేవించిన వాళ్ళు ఘోర నరకాలపాలు అవుతారు .వనం దేవత, చెట్లు దేవతలు ఐకమత్యం తో భోజనం చేసేవాళ్ళు అందరు దేవతలు .

### కార్తిక మాసం లో దామోదరుని యొక్క విశిష్టత ఏమిటి? ప్రథమంగా దామోదరున్ని పూజించాలి అంటారు ఎందుకు, అసలు దామోదరుడు అంటే ఎవరు?

దామోదరుడు అంటే విష్ణుమూర్తి దామము ఉదరము నందు కలవాడు, కనుక ఆయన దామోదరుడు అయ్యాడు శ్రీ మహావిష్ణువు యొక్క గొప్ప నామమది, శ్రీమహావిష్ణువు అవతారాలు ఎత్తడానికి మొట్టమొదట సంకల్పం చేసింది కార్తికమాసంలో, అంతకు పూర్వం ఆయన అవతారాలు ఎత్తాలి అనుకోలేదు, సృష్టిలో కాలం ఏర్పాటు అయ్యాక ఈ కాలానికి అధిష్టాన దేవత అయిన విష్ణుమూర్తి, నేను ఇకమీదట అప్పుడప్పుడు భూలోక రక్షణ కోసం దేవతలను మానవులను, అందరినీ రక్షించడం కోసం అవతారం ఎత్తాలి అని ఒక సంకల్పం చేశాడు ఆ సంకల్పం కార్తికమాసంలో చేయడం వల్ల ఈ మాస మునకే కార్తీక దామోదర మాసం అని పేరు వచ్చింది, విష్ణుమూర్తి కార్తికమాసంలో అవతారాలు ఎత్తాలి అనుకోవడం వల్ల ఈ మాసం విష్ణు మాసంగా ప్రశస్తికెక్కింది, శివుడు ఈ కాలంలో మానవులకు విత్తనాలు ఇవ్వాలి అనుకున్నాడు

ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాసపత్రిక



అందుకే కార్తిక మాసం ఇటు శివుడికి కూడా ప్రీతికరమైనది, ఈ విధంగా కార్తికదామోదరుడు, కార్తిక ఈశ్వరుడు అనే పేరుతో ప్రసిద్ధికి ఎక్కారు కాబట్టి ఈ కాలంలో,ఇటు శివుడిని అటు కేశవుడిని ఏ బేధం లేకుండా భక్తి తో పూజించాలి

### కార్తీక మాసంలో నదీ స్నానము యొక్క విశిష్టత ఏమిటి ? నదీ స్నానం వీలులేని పక్షంలో ఇంట్లో చేయవచ్చునా ?

కార్తిక మాసంలో తెల్లవారుఝామున లేవాలి, కార్తిక మాసంలో సూర్యుడు ఉదయించడానికి కొంచెం ముందు ఉన్నంత వరకు కాలంలో దేవతలలంతా మొత్తం దేవతలంతా బ్రహ్మతో కలిసి నదులలో జీవిస్తారు. గోదావరి,గంగా,యమునా,చర్మణ్వతి,కృష్ణవేణి ఇటువంటి దివ్య నదులలో దేవతలంతా స్నానం చేసి వెళ్లిపోతారు. దేవతలంతా ఏకకాలంలో ఎక్కడైనా ఉండగలరు, అందుకే దేవతలను సర్వాంతర్యాములు అన్నారు,ఇప్పుడు మనంకూడాతెల్లవారుఝూమున వాళ్ళు స్నానం చేసినప్పుడు ఆ నదిలో స్నానం చేస్తే మనకు లాభం ఏమిటి ఆ దేవతల స్పర్శతో నదికి శక్తి ఎక్కువ వస్తుంది, మహానుభావులు ఎప్పుడైనా మన ఊరికి వచ్చినప్పుడు ఆ ఊరి వాతావరణం లోనే మార్పు వస్తుంది, అదే పాపాత్ములు ఊర్లో ఉంటే అశాంతి ఉంటుంది. నదిలోకి దేవతలు రాగానే ఆ నదికి గొప్ప శక్తి వస్తుంది, దివ్య శక్తి వస్తుంది, చైతన్యం వస్తుంది అప్పుడు మనం స్నానం చేస్తే ఆ చైతన్యం మనం పొందుతాము, అందుకే ఈశ్వరుడు ఏమన్నాడు కార్తికమాసంలో సూర్యోదయానికి ముందు నిద్ర లేవండి, నదీ స్నానం చేయండి, అప్పుడు దేవతలలో ఉన్న చైతన్యం మీకు లభిస్తుంది. నదికి కూడా కార్తిక మాసంలో ఆ ప్రవాహంలో గొప్ప చైతన్యం ఉంటుంది(కరెంటు), నదీ జలాలలో విద్యుత్ ప్రవాహం ఉంటుంది అందుకే మనం కరెంటు అందులోంచి తీస్తున్నాము జలవిద్యుత్ అంటారు దాన్ని. అది తెల్లవారుఝూమున ఎక్కువగా ఉంటుంది. తెల్లవారుజామున స్నానం చేసినప్పుడు శరీరానికి వచ్చే శక్తి ఉత్సాహం తర్వాత చేస్తే అంతగా ఉండదు తర్వాత తర్వాత నదిలో కాలుష్యం కూడా పెరుగుతుంది.కాబట్టి మన శరీరానికి చైతన్యం, శారీరక చైతన్యం, మానసిక చైతన్యం, ఆధ్యాత్మిక చైతన్యం, ఇవన్నీ రావాలంటే దేవత అనుగ్రహం లభించాలంటే తెల్లవారుఝూమున సూర్యోదయానికి ముందు అరుణోదయ వేళకంటే ముందుగా స్నానం చేయాలి.అందరికీ నదులు ఇంటి దగ్గర ఉండవు కదా కొంతమంది అవకాశం ఉండదు నగరాల్లో ఉండాల్సి వస్తుంది అలాంటప్పుడు సముద్రం దగ్గర ఉంటే సముద్రం లో , కాలువలు దగ్గరలో ఉంటే కాల్వల్లో కానీ, కాలువలు లేనప్పుడు కొన్ని కొన్ని ఊర్లలో పెద్ద పెద్ద చెరువులు ఉంటాయి ( కురుక్షేత్రంలో కానీ తమిళనాడులో కానీ ) చెరువులు కూడా లేవను కోండి అప్పుడు ఏమి చేయాలి ఇళ్ళలో బాత్రూంనీళ్ల లోనే ఇది గంగాజలం యమునా జలం అని సంకల్పం చెప్పుకొని స్నానం చేస్తే ఆ స్నానం కూడా నది స్నానంతో సమానం అవుతుంది పూర్తిగా రాకపోయినా ఇంచుమించుగా సమానమవుతుంది, అందుకేగా కలశజలం లో

గంగేచ యమునేచైవ కృష్ణే గోదావరీ సరస్వతీ.!
నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు.!!

అంటున్నాం అలాగే మన ఇళ్ళలో బాత్రూంలో బకెట్ నీళ్లలో కూడా ఇందులోనే గంగ ఉన్నది ఇందులోనే యమున ఉన్నది అని సంకల్పం చెప్పుకొని తెల్లవారుజామున స్నానం చేస్తే ఆ స్నానం నదీ స్నానం తో సమాన మైన ఫలితం ఇస్తుంది

### కార్తిక మాసంలో చల్లనీళ్ళ స్నానం చేయలేని వాళ్ళు వేడి నీళ్లతో స్నానం చేయవచ్చా ?

మార్కండేయ పురాణం ఏం చెప్తుంది

మర్త్యునకు నిజేచ్ఛ చేయనగు రోగము పొందిన ఎప్పుడప్పానుల్.మానవునికి ఆరోగ్యం సహకరించినప్పుడు ఏ విధమైన స్నానమైనా చేయవచ్చును కార్తిక మాసంలో నెల రోజులు తలకు స్నానం చేయాలని శాస్త్రం, తలకు స్నానం చేస్తే ముసలి వాళ్లకు పడదు, ముసలి వాళ్ళకే కాదు



వృద్ధులకి,పసివాళ్ళకు ఆరోగ్యం బాగా లేని వాళ్లు వేడి నీళ్లు అయినా చేయవచ్చు అని చెప్పారు అందువల్ల తెల్లవారుజామున స్నానం చేయడం ముఖ్యం తప్ప వాళ్ళు ఏ నీళ్లు చేసినా ఫర్వాలేదు, ఆరోగ్యం బాగున్న వారు, ఓపిక ఉన్న వాళ్ళు మాత్రం తప్పక చల్ల నీళ్ళే చేయాలి,ఆరోగ్యం బాగోలేని వాళ్ళు ఏ నీళ్లు అయినా చేయవచ్చు,అస్సలు ఇంక కదల లేకుండా వర్ధక్యం లో వాంతులు వచ్చి పడిపోతూ ,దగ్గుకుంటూ ఉండేవాళ్ళు ఇన్ని నీళ్లు నెత్తిమీద తులసి దళంతో చల్లుకుంటే అది కూడా స్నానంతో సమానం, అలా కాకుండా ఓపిక ఉన్న వాళ్ళు తప్పక బద్ధకించకుండా చలి అనుకోకుండా స్నానం చేయాలి, కొంతమందుకి చేతులు వణుకుతూ ఉంటాయి నరాల బలహీనత తో, అలాంటి వాళ్ళు చల్ల నీళ్ల స్నానం చేయకుండా ఆరోగ్యం సహకరించట్లేదు కనుక వేడినీళ్ళతో స్నానం చేయవచ్చు అది చేయలేని వాళ్లు ఇంట్లో ఉన్న నీళ్లు తులసీదళంతో తల మీద చల్లుకున్నా భగవంతుడు స్నాన ఫలితం ఇస్తాడు.

## కార్తిక మాసంలో దీపారాధన మహా పుణ్యం అంటారు ఎందుకు ?

దీపం అంటే ఎంతో గొప్పది

దీపోజ్యోతిః పరం బ్రహ్మ, దీపః సర్వతమో పహం |

దీపేన సాధ్యతే సర్వం సంధ్యాదీప నమోస్తుతే ||

దీపం సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపం, జ్ఞానాన్ని ఇచ్చేది, దీపం లక్ష్మీస్వరూపం దీపంలో ఇటు చైతన్యం ఉన్నది, ఇటు వెలుతురు ఉన్నది,అజ్ఞానాన్ని తొలగించే శక్తి ఉన్నది,ఆ దీపం కూడా కార్తికమాసంలో ఉత్తప్పటి కంటే ఎక్కువ ఫలితం ఇస్తుంది.మొత్తం దేవతలందరికి ఆహారం ఎవరు ఇస్తారు? అగ్నిహోత్రుడు, అగ్నిహోత్రుడు ఏ రూపంలో ఉంటాడు దీపం రూపంలో ఉంటారు, అంటే మనం అగ్నిహోత్రాన్ని దేవత యొక్క ముఖ స్వరూపాన్ని ఇతరులకు దానం చేస్తున్నాం, దీప దానం అంటే దీపం వల్లనే కదా, చీకటి తొలగిపోతుంది మనలో అజ్ఞానమనే చీకటి ఉన్నది, ఈ చీకటి తొలగిపోవాలంటే కార్తిక మాసంలో ఆవు నేతి తో దీపం వెలిగించి దానిని ఇతరులకు దానం ఇవ్వాలి. ఈ దీప దానానికి నియమమేమంటంటే, డబ్బుంటే బంగారపు ప్రమిద, కొద్దిగా తక్కువ ఉంటే వెండి ప్రమిద, ఇంకా తక్కువగా ఉంటే మట్టి ప్రమిద అసలు డబ్బే లేకపోతే మట్టి ప్రమిద అయినా చేయవచ్చు కానీ పిసినుగొట్టు తనం పనికిరాదు డబ్బున్న వాళ్ళు బంగారం తో కానీ వెండి తో కానీ తయారు చేసిన ప్రమిద లో ఆవు నెయ్యి పోయాలి, ధనం లేని సామాన్యుడు మట్టి ప్రమిదలో నెయ్యి పోసి ఆ తర్వాత వత్తి వేసి దానిని శివుని సన్నిధానంలో కానీ,విష్ణువు సన్నిధానంలో కానీ,గురువుల సన్నిధానంలో గానీ వెలిగించి ఆ తర్వాత దక్షిణతో కలిపి దానం ఇవ్వాలి. ఈ దీపం వల్ల, దీపదానం వల్ల ఇటు జ్ఞానం పెరుగుతుంది అజ్ఞానం తొలగిపోతుంది దేవతల యొక్క అనుగ్రహం లభిస్తుంది, జీర్ణశక్తి కూడా పెరుగుతుంది అజీర్ణవ్యాధి ఉన్న వాళ్ళంత కార్తికమాసంలో ఈ నెల రోజులు దీప దానం చేస్తే కడుపులో జీర్ణశక్తి పెరుగుతుంది, కడుపులో ఉన్న అగ్నిహోత్రుడు ఆయనకు వైశ్వానరుడు అని పేరు ఆయన కూడా మనల్ని అనుగ్రహిస్తాడు.

## కార్తికమాసంలో తులసిమాతను, ఉసిరికాయ చెట్టును పూజించాలి అని అంటారు ఎందుకు ?

ఒకానొకప్పుడు గోలోకంలో ఉన్న తులసి అనే ఒక మహాత్మురాలు రాధాదేవి శాపం వలన భూలోకంలో ఒక రాక్షస వంశంలో జన్మించింది. ఆవిడ శంఖచూడుడు అనే ఆయనను పెండ్లి చేసుకున్నది. ఆ తర్వాత విష్ణుమూర్తి శంఖచూడుడిని చంపాలంటే తులసి యొక్క పాతివ్రత్య భంగం అవ్వాలని తెలుసు కనుక తులసి ప్రతివ్రతగా ఉన్నంతవరకు అంటే, ఆవిడ పరపురుష సంగమం చేయనంత వరకు శంఖచూడుడికి మరణం లేదు. అందుకే శివుడు ఎంత ప్రయత్నం చేసినా శంఖచూడుడు మరణించలేదు. అప్పుడు శివుడు విష్ణువుతో నీవు వెళ్ళి తులసి యొక్క పాతివ్రత్య భంగం చేయమనగానే, శంఖచూడుడి రూపంలో తులసీ సాంగత్యం చేశాడు విష్ణువు. దాంతో అక్కడ శివుడు శంఖచూడుడిని చంపాడు. ఇది తులసికి తెలిసింది. అప్పుడు ఆవిడకి కోపం



వచ్చి, నువ్వు మహానుభావుడవు అనుకున్నాను. కరుణాస్వరూపుడవు అనుకున్నాను. రాతి గుండె నీది. పాషాణం అయిపో! అని శపించింది. అప్పుడు ఆయన చిరునవ్వు నవ్వి, ఓసి! వెర్రి దానా! నీవు నాలో ఒక భాగం. రాధ యొక్క స్వరూపానివి. ఊరికే భూలోకంలో శాపవశాత్తు ఇలా పుట్టావు. నీవు నా భార్యల్లో ఒక దానివి. ఆ శంఖచూడుడు కూడా నా అంశతో పుట్టిన సుధాముడే కాబట్టి నేనేమీ నీకు పరపురుషుడను కాను. కాబట్టి భూలోకంలో ఉన్న నీకు నేను పరపురుషుడు వలె కనబడ్డాను. ఈ నీ శాపాన్ని అనుభవిస్తాను. నీవు వెంటనే నీ శరీరాన్ని విడిచిపెట్టు. నీ శరీరం గండకీ అనే పేరుతో నది క్రింద ప్రవహిస్తుంది. అందులో నా శరీరాన్ని విడిచి పెట్టేస్తాను. అది సాలగ్రామము అనే పేరుతో శిలగా మారిపోతుంది. ఆ తర్వాత నీ తల వెంట్రుకలలో కొన్ని వెంట్రుకలు తులసి మొక్కగా, కొన్ని వెంట్రుకలు ఉసిరిక మొక్కగా మారిపోతాయి. వాటిని కార్తికమాసంలోనే నీవు శపించావు కనుక, కార్తికమాసంలోనే నీవు నదిగాను, మొక్కలగాను మారుతున్నావు కనుక, నేను సాలగ్రామంగా మారుతున్నాను కనుక, ఈ కార్తికమాసంలో ఈ తులసి మొక్కని ఉసిరిక చెట్టుని పూజించేవాళ్లు రాధా మాధవుల్ని పూజించిన పుణ్యం పొందుతారు. వారి దారిద్ర్యం తొలగిపోతుంది. ఉసిరిక చెట్టు కింద కార్తికమాసంలో భోజనం చేసినటువంటి వాళ్ళు రాధా మాధవులకి స్వయంగా భోజనం పెట్టిన పుణ్యం పొందుతారు. కార్తికమాసంలో తులసీదళంతో దక్షిణ, బంగారం మొదలైనవి మహాత్ములకు దానం చేసిన వాళ్ళు గోలోకంలో ఉన్న ఆవులను స్వయంగా కృష్ణుడికి దానం చేసిన ఫలితం పొందుతారు అని వరం ఇచ్చాడు. అప్పటినుంచి ఆవిడ శరీరం గండకీ నదిగా ప్రవహిస్తే, కృష్ణుడి శరీరం అందులో సాలగ్రామ శిలలుగా మారిపోతే, ఆవిడ తల వెంట్రుకల్లో కొన్ని ధాత్రి వృక్షం అనగా ఉసిరిక చెట్టుగా మారాయి. మరికొన్ని తులసి వృక్షంగా మారాయి. కాబట్టి ఈ తులసిని, ఉసిరిని శ్రీకృష్ణుడు ఆజ్ఞ ప్రకారంగా మనమందరం కూడా పూజిస్తే, మనకి ఇన్ని శుభాలు కలుగుతాయి. ఈ ఉసిరి చెట్టు కింద భోజనం చేయడం రాధా మాధవులకు అన్నం పెట్టడం, తులసిదళంతో పూజ చేయడం అంటే రాధా మాధవుల దర్శనం చేయడం. తులసీదళంతో దక్షిణ దానం చేయడం, బంగారం దానం చేయడం అంటే, శ్రీకృష్ణుడికి భూలోకంలో ఉన్న గోవులను దానం చేయడం వంటి పుణ్యాలు మనకు లభిస్తాయి.

**గౌరీ పూజకు ప్రత్యేకమైన వైశిష్ట్యం ఈ మాసంలో ఉంది అంటారు. అయితే శివారాధనకు ఉన్నంత ప్రత్యేకత ఉందా, గౌరీ మాత పూజ లోకూడా ?**

ఒకప్పుడు పార్వతీదేవి ఈశ్వరుడే తన భర్త కావాలని సంకల్పించింది.

భూధర రాజకన్య మణిభూషణముల్ దిగద్రావి ఈశ్వరా

రాధన కేళి కౌతుక పరాయణయై ధరియించి బాండు ర

క్షాధృతి పూర్వకంబుగ బ్రగాఢ పయోధరమండలీ సము

త్స్వేద విశీర్ణ సంహతుల జెల్లు మహీరుహవల్కలంబులన్

అని శ్రీ నాథుడు హరవిలాసంలో అద్భుతమైన పద్యం చెప్పారు. పార్వతీ దేవి, శివుడు నాకు భర్త కావాలి. ఈ శివుడు నన్ను వరించడంలేదు అనుకుని, తన నగలన్నీ తీసివేసి నారచీరలు ధరించింది. రుద్రాక్షలు, విభూతి రేఖలు ధరించింది. జడలన్నీ అట్ట కట్టేలాగున జుట్టుని ముడి వేసుకున్నది. ఆ తర్వాత హిమాలయ పర్వతంలో ఈశ్వరా! ఈశ్వరా! ఈశ్వరా! నాకు భర్త కావాలంటూ ఓం నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్రం జపం చేయడం మొదలుపెట్టింది. అలా గౌరీదేవి శివుడు తన భర్త కావాలని తపస్సు ప్రారంభించిన కాలం పరమ పవిత్రమైన ఈ కార్తిక మాసకాలం. ఈ కార్తిక మాసంలో ఈశ్వరుణ్ణి తెల్లవారు ఝామున పవిత్ర గంగానదిలో, ఆకాశగంగ మందాకినిలో స్నానం చేసి అర్చించింది. మందాకిని అంటే మాటలా!హిమాలయాలలో కేదారంలో మందాకినీలో స్నానం చేస్తే శరీరం స్తంభించి పోతుంది. అటువంటి



చలిలో ఆవిడ స్నానం చేసింది. అందుకని ఈశ్వరుడు, ఆ తర్వాత ఆమెకు భర్త అయ్యాక, నీవు కార్తికమాసంలో నాకోసం మహా తపస్సు చేశావు. కాబట్టి కార్తిక మాసాన్ని గౌరీ ప్రీతికర మాసంగా మారుస్తున్నాను నేను. ఇటు శివుడికి, విష్ణువుకి, బ్రహ్మకి, గౌరి ఐన నీకు ప్రీతి పాత్రమైనది. ఈ కాలంలో పసుపు ముద్దతో గౌరీ విగ్రహం తయారు చేసినవాడు, శిలా విగ్రహంగా గౌరీదేవిని పూజించేవాడు లేక బంగారం, వెండి మొదలైన ధాతువులతో గౌరీదేవి యొక్క విగ్రహమును తయారుచేసి కార్తిక మాసంలో పూజించేవాడు, అందులోనూ ముఖ్యంగా సోమవారం, మంగళవారం, ఏకాదశి, పూర్ణిమలలో నిన్ను పూజించేవాడు, నీవిగ్రహాన్ని ఇతరులకు దానం చేసేవాడు శాశ్వతంగా నీ అనుగ్రహం వల్ల కైలాసం చేరుకుంటాడు అని ఈశ్వరుడు వరమిచ్చాడు. కాబట్టి గౌరీ దేవికి అంత విలువ ఉన్నది. శివ, విష్ణువుల పూజలు ఎంత గొప్పవో, ఈ కాలంలో గౌరీ పూజ కూడా అంతే గొప్పది. అందుకే మహానుభావులు ప్రణవపీఠం లాంటి పీఠములలో ముగ్గురమ్మలను స్థాపించి అమ్మవారిని అందుకే ప్రత్యేకంగా ఈ కాలంలో పూజిస్తారు.

## కార్తిక మాసంలో దీపదానం యొక్క వైశిష్ట్యం ఏమిటి?

దీపం ఎంత గొప్పదో అందరికీ తెలుసు. ఒకానొకప్పుడు గుణనిధి అని ఒక పాపాత్ముడు ఉన్నాడు. వాడు అనుకోకుండా దీపాన్ని దానం చేశాడు. దీపాన్ని వెలిగించాడు. దాంతో వాడు కుబేరుడు అయ్యాడు. ఆ కుబేర చరిత్ర కాశీఖండంలో , శివ పురాణాల్లో కూడా ఉంది చాలా గొప్పది. ఈశ్వరుడు అప్పటినుంచి ఏమన్నాడంటే శివాలయంలో వెలిగించే దీపం మొత్తం భువనబ్రహ్మాండములకు వెలుతురు చూపించడంతో సమానం. ఒక్క క్షణం ఎవరైనా ఒక ఊహ చేస్తే, ఈ ప్రపంచంలో సూర్యుడు కాసేపు లేడు, అసలు చంద్రుడు లేడు నక్షత్రాలు లేవు ఒకటే చీకటి. కటిక చీకటి. ఆ కటిక చీకటి ఎక్కువ కాలం ఉండిపోతే ఏమైపోతారు మానవులు? కాశీఖండంలో చెప్పారు, ఒకానొకప్పుడు ప్రళయ కాలంలో అనక్షత్రకంబు, అనర్కంబు, అచంద్రకంబు, అతారకంబు అంటారు. అంటే ఎక్కడా చంద్రుడు లేడు, నక్షత్రాలు లేవు, సూర్యుడు లేడు. అంతా కటిక చీకటి చీకటి. కొన్ని వేల సంవత్సరములు లక్షల సంవత్సరాల పాటు ఈ భూమండలమంతా కటిక చీకటితో నిండిపోయింది. అలాంటి చీకటే గనుక భూలోకంలో ఉంటే మానవులు ఏమైపోతారు? అటువంటి కాలంలో ఎవరైనా దీపం వెలిగిస్తే ఒక్కసారి ఏమవుతుంది? మనలాంటి వాళ్లకి చీకట్లో వెలుతురు కనిపిస్తే ఎంత ఆనందం పొందుతాము? అందుకనే ఈశ్వరుడు ఏమన్నాడు అంటే, కార్తికమాసం అనేది ఏమిటంటే ప్రళయకాల చీకటితో సమానం. అందువల్ల ఈ కాలంలో దీపం వెలిగించడం అంటే!భూలోకంలో ఉన్నటువంటి జీవులందరికీ సూర్యుణ్ణి చూపించడం వంటిది, చంద్రుడిని చూపించడం వంటిది, నక్షత్రాలు చూపించడం వంటిది. కటిక చీకటిని తొలగించి వెలుతురు ఇచ్చే వాడి పుణ్యమంతా ఇంతా కాదు. కార్తికమాసంలో ఆవునేతితో దీపం వెలిగించండి. దానిని దానం చేయండి. దీపదానం చేయడం అంటే సూర్యుణ్ణి ఆకాశంలో ప్రతిష్ఠించడంతో సమానం అయిన పుణ్యం. చంద్రుడిని ఆకాశంలో ప్రతిష్ఠించడంతో వచ్చే పుణ్యంతో సమానం. 27 నక్షత్రాలు ఆకాశంలో ప్రతిష్ఠించడంతో వచ్చే పుణ్యంతో సమానం అని ఈశ్వరుడు వరమిచ్చాడు. అప్పటినుంచి ఈ కార్తికమాసంలో దీపాలు వెలిగించి దానం చేయడం మొదలుపెట్టారు. దీపదానం చేయడం అంటే ఇంత పుణ్యం అన్న మాట. సూర్యుణ్ణి సృష్టించడం మన వల్ల కాదు. ఆయనను సృష్టించి ఆకాశంలో పెట్టడం, చంద్రుణ్ణి సృష్టించి ఆకాశంలో పెట్టడం, నక్షత్రాలు సృష్టించి ఆకాశంలో పెట్టడం వల్ల వచ్చే ఫలితం ఒక దీపదానం వల్ల వస్తుంది. దీప దానం భూమండల దానంతో సమానం. దీపదానం ఉసిరికాయ మీద పెట్టి మరీ ఇస్తే! అనగా ఉసిరికాయ మీద ఒక దీపం పెట్టి వెలిగించి దానం ఇస్తే ఇక ఆ పుణ్యం అంతా ఇంతా కాదు. ఈ దీపంలో వత్తితో పాటు ఒక బంగారపు వత్తి లేదా వెండి వత్తి కూడా వేస్తే అది



మరింత ఫలితం ఇస్తుంది. కాకపోతే దీపదానం ఎప్పుడూ కూడా వ్యసనములు లేనివారికి మహాత్ములకి , పండితులకి, ఉపాసనా బలం కలిగిన వాళ్ళకి ఇవ్వాలి. పాత్రత లేని వారికి దానం చేస్తే అది మహా పాపం చేయడం. మహాపాపం అని శివపురాణంలో ఉన్నది, విష్ణు పురాణంలోనూ ఉన్నది. పాత్రత లేని దానం మహా పాపం అని చెప్పారు కావున ఇచ్చేటప్పుడు కొంచెం వెనుక ముందు చూసుకుని మాత్రం దానం చేయాలి.

**ధన త్రయోదశి నాడు బంగారం ఖచ్చితంగా కొనాలంటారు ఎందుకు? బంగారం బదులు ఇంకేమైనా కొనవచ్చా? కొంతమంది చీపురు కొన్నా అదే ఫలితం ఉంటుంది అంటారు కదా, అది నిజమేనా?**

నిజానికి ధన త్రయోదశి నాడు లక్ష్మీదేవిని పూజించండి అని ఉన్నది. అంతేగాని బంగారం కొనాలి లేదా ఇంకోటి కొనాలని లేదు. కాకపోతే బంగారం కొంటే మనకు లాభమే కదా! కొనుక్కుంటే నష్టమేమీ లేదు. లక్ష్మీదేవికి బంగారు పూలతో పూజ చేయిస్తాం అనుకోండి అది ఇంకా లాభం. ధన త్రయోదశి నాడు మనం చేయవలసింది లక్ష్మీ పూజ. ఇంక మిగతావన్నీ మీరేం కొనుక్కున్నా, కొనుక్కోకపోయినా అది వారి ఇష్టం. మీకు ఉపయోగపడడానికి తప్ప శాస్త్రములలో ఈరోజు బంగారం కొనాలని గాని, ఈరోజు బట్టలు కొనాలని గాని ఏమీ చెప్పలేదు. కాకపోతే మన లాభం కోసం పూర్వకాలంలో ఉత్తప్పుడు వ్యసన పరులైన భర్తలు భార్యలకు ఏమీ కొని ఇచ్చేవారు కాదట, (మన గురువుగారి లాంటి) గురువులు ధన త్రయోదశి నాడు కొంచెం బంగారం కొనాలి, కొని మీ భార్యలకు ఇస్తే నీకు ఐశ్వర్యం పెరుగుతుంది అంటే, కనీసం ఈ ఒక్కరోజైనా ఆయన తన డబ్బు ఖర్చు పెట్టి భార్యామణికి ఏదో ఒక నగ చేయించాడనుకోండి! ఆ డబ్బు ఇంట్లో ఉపయోగపడుతుంది కదా! అతను సద్వినియోగం చేస్తున్నాడు. అందుకని గురువులు కొంతమంది వాళ్ళు బాగుపడతారని ధన త్రయోదశి రోజునైనా బంగారం కొనండి. ఈ రోజైనా బట్టలు కొనండి. ఈ రోజైనా మంచి పనులు చేయండి అంటే, వాడు ఒక్కరోజైనా శాస్త్రంలో చెప్పింది కాబట్టి ఆచరిస్తాడు. అందుకని కుటుంబానికి బాగు చేయడానికి గురువుగారు చెప్పారు కానీ శాస్త్రములు కాదు. కుటుంబానికి లాభం, కాకపోతే కొనకపోతే మాత్రం ప్రమాదం అని కాదు.

**దైవ పూజలో పాటించవలసిన నియమాలు ఏమిటి?**


దేవతా పూజలు చేసేటప్పుడు ఎప్పుడూ కూడా ముందు శుచిగా ఉండాలి. పవిత్ర స్నానం చేయాలి. చేతులు కాళ్లు ఇలాంటివి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. దేవతా పూజలో ఆచమనము చేయకుండా సంకల్పం చెప్పకుండా అర్చన చేయకూడదు. దీపారాధన చేయని దేవతార్చన వ్యర్థమైపోతుంది కాబట్టి దీపం వెలిగించాలి. ఈ అర్చన చేస్తున్నప్పుడు సాధ్యమైనంత వరకు వ్యర్థ ప్రసంగాలు లేకుండా చూసుకోవాలి. అందుకే పూజ చేస్తున్నప్పుడు పూజ మీద దృష్టి ఉంచాలి అని, దేవాలయాలలో ఫోటోలను వీడియోలను నిషేధించారు. (ఈ మధ్యకాలంలో చాలా మంది వ్యాఖ్యాత్రీమణులు కూడా వ్యాఖ్యానం మానేసి ప్రశ్న కన్నా వాళ్ళ ఫోటోలు తీస్తున్నారా! అని గుమ్మటంగా ఉండి పోతున్నారు. అందుకే ప్రశ్నలు ఆలస్యం అయిపోతున్నాయి) చిత్తం శివుని మీద ఉండడంలేదు. ఈ కారణముల చేత మనం దేని మీద దృష్టి పెట్టాలో దాని మీదే దృష్టి పెట్టాలి తప్ప దృష్టిని ఇంకొక దాని మీదకి కేంద్రీకరించకూడదు. అందువలన ఫోటోలు లాంటి పిచ్చ విడిచిపెట్టి ఏకాగ్రచిత్తులై దేవతార్చన చేయాలి. అంటే, దేవతార్చనకి దీపం వెలిగించాలి, సంకల్పం చేయాలి, ఆచమనాదులు ఉండాలి. తర్వాత ఎట్టి పరిస్థితుల్లో మనసు చెదరనివ్వకుండా ఏకాగ్ర చిత్తులై ఉండాలి. మంచి మంచి పుష్పాలు మొదలైన ధూప దీపాలుతో షోడశోపచారాలు చేయాలి. ఏదైనా పవిత్రంగా ఉండి అర్చన చేస్తే చాలు. ఇక ద్రవ్యమంటారా! మన ఆర్థిక శక్తిని బట్టి యథాశక్తిగా చేసుకోవచ్చు. డబ్బు బాగా ఎక్కువగా ఉంటే ధూప దీప నైవేద్యాలు ఎక్కువ చేయొచ్చు. భగవంతుని పేరు చెప్పి



దానాలు చేయగలుగుతారు, కొంచెం ఆర్థిక శక్తి తక్కువగా ఉంటే తక్కువ దానాలు చేస్తారు. కానీ మనసు మాత్రం ఈశ్వరుడు మీదే, దేవుడి మీదే లగ్నం చేయాలి.

### కార్తిక మాసంలో ఆకాశ దీపాలు ప్రత్యేకంగా వెలిగిస్తారు ఎందుకు? అయితే కార్తికమాసంలోనే ఈ ఆకాశదీపం యొక్క వైశిష్ట్యం ఉన్నదా?.

ఇక్కడ రెండు కారణాలు చెప్పాలి. ధ్వజస్తంభం మీద ఆకాశదీపం పెట్టగానే దేవతలు అనగా ఉదాహరణకు.... శివాలయం అయితే శివాలయంలోని ధ్వజస్తంభం మీద దీపం ఉంచితే శివుడు ఆ దీపం చూసి ఆ దేవాలయంలోని ధ్వజస్తంభం పై తిష్ట వేసుకొని కూర్చుంటాడు. ఆయన శక్తి పూర్తిగా కేంద్రీకృతం అవుతుంది. అదే విష్ణు ఆలయంలో అయితే విష్ణువు నివసిస్తాడు అనగా దేవతలు ఈ దీపమునకు ఆకర్షితులై ఆ గుడిలో ఉంటారు. గుడిలో ఉన్నారంటే! మన కోరికలు తొందరగా తీరుస్తారు. రెండవది, పూర్వకాలంలో ఈ కరెంటు దీపాలు విద్యుత్ దీపాలు లేవు కాబట్టి, ఎక్కడ అడవులలో పొరుగు ఊర్లలో ఉన్న వాళ్ళకి, ఈ దగ్గరలో దీపం ఉందని మనకు కనబడిందంటే, ఓహో! ఊరు ఉందని తెలుస్తుంది. ఉదాహరణకు ఒకాయన అడవిలో నడుస్తున్నాడు. ఆ కాలంలో, అటువంటి సమయంలో ఎక్కడుంది ఊరు అని వెతుక్కుంటుంటే, దూరంగా ధ్వజస్తంభం మీద దీపం కనబడితే ఏమవుతుంది అన్న మాట, ఓహో! ఇక్కడ ధ్వజస్తంభం మీద ఆకాశదీపం ఉంది కాబట్టి ఇక్కడ ఒక ఊరు ఉంది అని తెలుస్తుంది. అందుకని అడవులలో ప్రయాణాలు చేసే వారికి ఆ ఊరు ఉందని తెలియజేయడానికి కూడా ఆకాశదీపం పెట్టేవాళ్ళు. ఇక మూడవది, ఆకాశదీపము అంటే యమధర్మరాజు భయం తొలగించుట. స్వయంగా విష్ణుమూర్తి ఏమని చెప్పాడంటే, ఆకాశదీపం వెలిగించిన వాళ్ళు, ఆకాశదీపంలో చూసేవాళ్ళు యముడి భయమును పొందకుండా ఉందురు గాక! అని వరం ఇచ్చాడు. అందుకే కార్తిక మాసంలో ఈ నెలనాళ్ళూ ఆకాశదీపం పెట్టి, ఆ దీపాన్ని చూసినా, ఆ దీపానికి సహకారం చేసినా, ఆ దీపంలో నూనె పోయడానికి గాని వత్తులు వెలిగించడానికి గానీ, ఏదైనా సాయం చేస్తే అటువంటి వాళ్ళు యమలోకానికి వెళ్ళరు. కాబట్టి ఆకాశదీపం చాలా మంచిది. ఒకటి, యమభయం తొలగిస్తుంది. రెండవది... ఊరు ఎక్కడ ఉందో తెలుపుతుంది. మూడవది.. దేవతలను ఆకర్షిస్తుంది. తద్వారా దేవతల శక్తి మనకు లభించేలా ఆకాశదీపం మనకి సాయం చేస్తుంది.





# సత్సంగ సమాచారం

**శరన్నవరాత్రుల** సందర్భముగా పూజ్య గురుదేవుల అనుగ్రహంతో అనేక పోటీలను శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం నిర్వహించింది. గురుభక్తులు అందరూ అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన అభ్యర్థులకు శుభాకాంక్షలు. విజేతల వివరాలు

### ప్రసంగపు పోటీలు (పిల్లలవిభాగం)

1.Chi. Ambika Sugatri K
2.Chi. Anish B
3.Chi.Gautam Narayana Chiredi
4.Chi.Jai Mayur Bhaskarbhatla
5.Chi.Roshni Reddy
6.Chi Sri Abhiram
7. Chi SriAkshaj Bolisetti
8.Chi Vedamsha Gourisetti

### ప్రసంగపు పోటీలు(పెద్దలవిభాగం)

మొదటి విజేత: Sri. R.R.Srikanth
రెండవ విజేత: Sri. Manoj kumar Asam
మూడవవిజేత:Sri.DuddikuntaVishnuvardhanReddy

### చిత్రలేఖనపు పోటీలు పిల్లలవిభాగం

మొదటి విజేత: Chi .Divya Hamsini
రెండవ విజేత: Chi .B. Deekshita
మూడవవిజేత: Chi .Samyuktha PSNSV

### చిత్రలేఖనపు పోటీలు (పెద్దలవిభాగం)

మొదటి విజేత: SHRUTI CHINTAKAYALA
రెండవ విజేత: SUJATHA.G
మూడవవిజేత: Neeraja & Shailaja Boddupalli

### Quiz winners

రెండవ విజేత: R. R. Srikanth
మూడవవిజేత: Smt SAMYUKTHA PSNSV

### స్వరూపప్రదర్శన పోటీలు

1.Vijayalskshmi vakeel
2.Gupteswari Vasupilli
3.Akshaya kowndinya. V
4.Swathi Vasupilli
5.Katroju Jyothi
6.P.Laasya Kamakshi
7.Madishetty nityasree
8.ANKARAJU VIDITHA TANVI
9.Poorna Satya Sudha Bolisetti
10.Mahankali sitamahalakshmi
11.Sri Aishani Bolisetti
12.V.Geetha Reddy
13.Ruthvika Chandolu
14.V Dharani kumari
15.B. Deekshita
16.Gosula srinidhi
17.B. Nagasharanya
18.Kadapa Roshni Reddy
19.Y KEERTHANA SURYANI
20.Joshitha. Linga
21.PADMAVATHI G
22.RUSHWIKA G
23.Rushika Chandolu

*****





## శ్రీ మంగళషష్ఠి స్తోత్ర పారాయణం

దేవీ నవరాత్రులలో భాగముగా, అమ్మవారి ఆరవ అంశగా ఉద్భవించిన బ్రహ్మమానసపుత్రిక, విష్ణుమాయ, దేవసేన, కుమారస్వామి పత్ని అయిన షష్ఠిదేవీస్తోత్ర పారాయణను సత్సంగ భక్తుల సంకల్పం సిద్ధించాలనే సత్సంకల్పముతో,గురదే వుల అనుగ్రహంతో సత్సంగ భక్తులందరూ సామూహిక పారాయణం చేయడం జరిగింది. పారాయణమునకు కుమారి ధరణి గారు సమన్వయ కర్తగా వ్యవహరించారు. ఈ పారాయణం కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన స్వయంసేవకులు శ్రీమతి కావూరి పద్మావతిగారు, శ్రీ మల్లికార్జునగారు, శ్రీ భూపాలం జితేంద్రగారు, శ్రీమతి యరసింగి మాధవి గారు. ఎంతో నిష్ఠగా సామూహిక పారాయణం లో పాల్గొన్న భక్తులందరికి గురుదేవుల ఆశీస్సులు లభించాయి

*****